# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com

తెలంగాణ ఎడిటర్: విప్పల చంద్రశేఖర్ | బుధవారం 13-11-2024 | పేజీలు: 8 | వెల : అమూల్యం




జాన్వీకి రిస్క్ తీసుకోవడం అంటే ఇష్టం..

...సినిమాలో



## గవర్నర్ అనుమతి రాగానే కేటీఆర్‌పై చర్యలు

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు.

2



8

## ఛాంపియన్స్ ట్రోఫీకి పాక్ దూరం?

### దక్షిణాఫ్రికాలో టోర్నీ!



6

## ఓ రైతు.. రైలుకు ఓనరయ్యాడు.. ఎలాగంటే?



### కలెక్టర్‌పై దాడికి కీలక పాత్రదారి

# పట్నం నరేందర్?

### ప్రధాన సూత్రధారి మాజీ మంత్రి కేటీఆర్?

- దాడులను ప్రోత్సహిస్తుందెవరో గుట్టురట్టు చేసిన పోలీసులు
- పోలీసుల అదుపులో కుట్రకు పాల్పడిన వ్యక్తి సురేష్...?
- నిఘా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్‌బాబు
- ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేసిన ఉద్యోగ సంఘాల జేఏసీ

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు స్థలసేకరణ కోసం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో రైతుల పేరుతో వికారాబాద్ కలెక్టర్ పై జరిగిన దాడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ పై దాడి చేసేలా స్థానిక జనాలను రెచ్చగొట్టిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. దాడికి కుట్ర చేసిన వ్యక్తిని భోగముని సురేష్ గా గుర్తించారు. నిందితుడు సురేష్. బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడని పోలీసులు విచారణలో తేలిచింది. కలెక్టర్‌పై దాడి జరగడానికి కొన్ని గంటల ముందు పట్నం నరేందర్ రెడ్డితో సురేష్ 42 సార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు ఆధారాలను సేకరించారు. అలాగే.. పట్నం నరేందర్ రెడ్డి నిందితుడులు సురేష్ తో మాట్లాడుతూనే 6 సార్లు కేటీఆర్ తో ఫోన్లో మాట్లాడినట్లు నరేందర్ రెడ్డి కాల్‌డేటా ఆధారాలను పోలీసులు సేకరించారు. దాడికి పాల్పడిన సురేష్ పై ఇప్పటికే ఒక రేప్ కేసుతో సహా పలు కేసులు ఉన్నాయి. చెల్లెలి వరస అయ్యే అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడినందుకు రేప్ కేసు నమోదైంది. సురేష్ పై నమోదైన కేసులు తొలగించేలా బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి సహాయం చేయడంతోనే ఆయన చెప్పినట్లు చేసినట్లు నిందితుడు పోలీసుల (మిగతా 2వ పేజీలో)





### లగచర్ల గ్రామంలో15 మంది రైతులను అరెస్ట్ చేసిన పోలీసులు

అధికారులపై దాడికి రాజకీయ కోణం ఉండవచ్చన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది

ఐజి వి సత్యనారాయణ వెల్లడి

2

### నిఘా విఫలం కావడంపై మంత్రి శ్రీదర్‌బాబు సీరియస్

2



# జీ-20 సదస్సుకు ప్రధాని మోదీ..

### మూడు దేశాల్లో పర్యటన షెడ్యూల్ ఖరారు

**దిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ మూడు దేశాల్లో పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు నైజీరియా, బ్రెజిల్, గయానాల్లో పర్యటించనున్నట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. తొలుత నైజీరియాకు వెళ్లను న్నారు. ఆ దేశ అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు ఈ నెల 16, 17వ తేదీల్లో అక్కడ పర్యటించను న్నారు.అనంతరం జీ-20 సదస్సులో పాల్గొనేందుకు బ్రెజిల్‌కు పయనమవుతారు. ఈ నెల 18, 19వ తేదీల్లో ఆ దేశంలో పర్యటించనున్నారు. "సదస్సు సందర్భంగా వివిధ ప్రపంచ అంశాలపై భారత్ వైఖరిని ప్రధాని మోదీ చాటిచెబుతారు. 'జీ20 దిల్లీ డిక్లరేషన్', వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సమ్మిట్‌ల ఫలితాలను విశ్లేషించనున్నారు" అని విదేశాంగశాఖ తెలిపింది. సదస్సు క్రమంలోనే పలువురు నేతలతో మోదీ భేటీ కానున్నట్లు సమాచారం.

బ్రెజిల్ సందర్శన ముగించుకుని 19వ తేదీన గయానాకు వెళ్లనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు మొహమద్ ఇర్ఫాన్ అలీ ఆహ్వానం మేరకు 21వ తేదీ వరకు అధికారిక పర్యటన కొనసాగనుంది. 17 ఏళ్లలో నైజీరియాలో, 1968 తర్వాత గయానాలో పర్యటించనున్న తొలి భారత ప్రధాని మోదీనే కావడం గమనార్హం.

## కేటీఆర్ ఢిల్లీకి ఎందుకు పోతారో తెలుసు

### మంత్రి శ్రీధర్‌బాబు

2



## కేటీఆర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

- తనను రమ్మని కోరితే కేటీఆర్ వద్దకు వెళ్తా
- సలహాలు ఇచ్చినా స్వీకరిస్తా
- ఆత్మహత్యకు గతంలో చేసిన అప్పులే కారణం
- కరీంనగర్ కలెక్టరేట్‌లో మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మంత్రి

2



## తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ మోదీ ఏం చేస్తున్నారు?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- సీఎం రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు
- తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు
- అమృత్ టెండర్ల అవినీతిపై ఆధారాలున్నాయి
- అర్హత లేకున్నా శోధా కంపెనీకి టెండర్లు
- సుజన్‌రెడ్డికి ఉన్న అర్హత కేవలం సీఎం బావమర్దిగానే!
- కేంద్రం స్కీంలో అవినీతి జరుగుతుంటే ప్రధాని మోదీ ఏం చేస్తున్నారు?

2





### సీఎంగానే కాదు ఎమ్మెల్యేగా కూడా రేవంత్‌రెడ్డి ఫెయిల్

- 300 అడుగుల రహదారి ఎందుకని ప్రశ్న
- భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్
- అగర్‌మియాగూడలో రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే సబితారెడ్డి

5

## స్థానిక పత్రికలపై సొంతరాష్ట్రంలో వివక్ష

### అన్యాయం జరిగితే పోరాటాలకు సిద్ధం

### హైదరాబాద్‌లో డబ్ల్యూజేఐ రాష్ట్ర సదస్సు

2



ప్రజాభూమి

# స్థానిక పత్రికలపై సొంతరాష్ట్రంలో వివక్ష

## అన్యాయం జరిగితే పోరాటాలకు సిద్ధం.. హైదరాబాద్‌లో డబ్ల్యూజేఐ రాష్ట్ర సదస్సు

**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్:**

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన స్థానిక పత్రికల యాజమాన్యాలు రాష్ట్రంలో అంతులేని వివక్షకు గురవుతున్నాయని డబ్ల్యూజేఐ రాష్ట్ర సదస్సు అభిప్రాయపడింది. తెలంగాణ స్థానిక పత్రికలు- యాజమాన్యాలు- అక్రిడిటేషన్లు - రేట్ కార్డులో వివక్ష... డిమాండ్ల సాధన అంశాలపై

బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) మంగళవారం హైదరాబాద్ నాగోల్‌లో మంగళవారం రాష్ట్ర సదస్సు విజయవంతంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి స్థానిక పత్రికల యజమానులు, ఎడిటర్లు, పాత్రికేయులు దీనికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

డబ్ల్యూజేఐ గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు సామాజికవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీమనోహర్, వీ 3 న్యూస్, విశ్వంభర పత్రికల అధినేత, పలుస్వచ్ఛంద సంస్థల నిర్వాహకుడు డాక్టర్ కాచం సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. డబ్ల్యూజేఐ అధ్యక్షుడు రాణాప్రతాప్, ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, అనిల్ దేశాయ్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, కార్యదర్శులు శివనాద్రి ప్రమోద్‌కుమార్, క్రాంతి, సహా కార్య నిర్వాహక కార్యదర్శి బెజ్జంకి నరేశ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

### జాతిప్రయోజనాలే లక్ష్యం కావాలి

జాతి ప్రయోజనాలే లక్ష్యంగా జర్నలిస్టులు పనిచేయాలని మురళీమనోహర్ సూచించారు. పాత్రికేయులు తమ రాతలతో దేశ ఔన్నత్యాన్ని చాటాలన్నారు. కించపరిచేలా, గొప్పదనాన్ని తగ్గించేలా కథనాలు రాయవద్దన్నారు. సమాజంలో వెలుగులు నింపే వృత్తిని స్వచ్ఛందంగా స్వీకరించిన పాత్రికేయుల జీవితాలు చీకట్లో ఉండటం బాధాకరమన్నారు. వారి సమస్యలపై పోరాడేందుకు డబ్ల్యూజేఐ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ సంస్థకు అందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

### సంఘాలు ప్రభుత్వాలకు వత్తాసు పలకొద్దు: కాచం

డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ పాత్రికేయ సంఘాలు ప్రభుత్వాలకు వత్తాసు పలకకుండా జర్నలిస్టుల సంక్షేమం కోసమే పాటుపడాల్నారు. అప్పుడే ఆ సంఘాలకు , నాయకులకు విలువ, గౌరవం లభిస్తాయన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే వారిలో అత్యంత ముఖ్యులు పాత్రికేయులని, వారు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. వారి సంక్షేమం కోసం డబ్ల్యూజేఐ చేసే పోరాటాలకు అండగా ఉంటానని అన్నారు. చిన్నా, పెద్ద అని కాకుండా అన్ని పత్రికలను సమంగా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సంఘాలతో నిమిత్తం లేకుండా అందరు పాత్రికేయుల సంక్షేమం కోసం డబ్ల్యూజేఐ

పాటు పడుతుందని నందనం కృపాకర్ అన్నారు. జాతీయ స్థాయిలో 17 రాష్ట్రాలలో కార్యకలాపాలు చేపట్టడమే కాకుండా జిల్లా, మండల స్థాయిలో విస్తరించిన యూనియన్ డబ్ల్యూజేఐ మాత్రమేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ అన్నారు.

### ఆ వ్యాఖ్యలు దురదృష్టకరం

మీడియా అకాడమీ అధ్యక్షుడిగా, జర్నలిస్టుల అక్రిడిటేషన్ల మార్గదర్శకాల రూపకల్పన కమిటీ ఛైర్మన్‌గా ఉన్న వ్యక్తి, సాక్షాత్తు ముఖ్యమంత్రి సమక్షంలో, అక్రిడిటేషన్లు అమ్ముకుంటున్నారని, అవి అంగట్లో సరుకులా మారాయని వ్యాఖ్యానించడం దురదృష్టకరమని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ఆరోపించారు. .స్థానిక పత్రికల సమస్యల పరిష్కారం విషయంలో

ప్రభుత్వంతో ప్రాతినిధ్యం వహించేందుకు తమ సంఘం సిద్ధంగా ఉందని, ప్రభుత్వం ఈ సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుంటుందనేనమ్మకం తమకుందన్నారు.స్థానిక పత్రికలకు ఎలాంటి అన్యాయం జరిగినా, వారితో కలిసి ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని ప్రకటించారు.

### తీర్మానాలివే...

- తెలంగాణ స్థానిక పత్రికల అక్రిడిటేషన్ల జారీ కోసం ఇంతకాలం అనుసరించిన కేటగిరిల విధానాన్ని తొలగించిపత్రికలన్నిటిని సమదృష్టితో చూడాలని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు లోబడి, ఆయా పత్రికలు ప్రచురించే పేజీల ఆధారంగా అక్రిడిటేషన్లు కేటాయించేందుకు అనువుగా మార్గదర్శకాలు రూపొందించాలని బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.
- 12 పేజీలతో వెలువడే పత్రికలకుసమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయంలో కనీసం 8 అక్రిడిటేషన్లు, ప్రచురణ కేంద్రంలో రెండు అక్రిడిటేషన్లు, ప్రతి మండల కేంద్రంలో ఒకఅక్రిడిటేషన్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.
- అలాగే 8 పేజీలతో వెలువడే పత్రికలకు ఐ అండ్ పిఆర్ కార్యాలయంలో ఆరు అక్రిడిటేషన్లతో పాటు ప్రతి మండల కేంద్రంలో పనిచేసే జర్నలిస్టుకు అక్రిడిటేషన్ సదుపాయం కల్పించాలని కోరింది.
- సీనియారిటీ, పేజీలు, సర్క్యులేషన్ ఆధారంగా స్థానిక పత్రికలకు కల్పించాల్సిన అప్ గ్రేడేషన్ విషయంలో ఏళ్ల తరబడి జరుగుతున్న జాప్యం పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడేళ్లుగా కొనసాగుతున్న ఈ జాప్యానికి స్వస్తి పలికి, అప్ గ్రేడేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది.
- స్థానిక పత్రికల రేటు కార్డు పెంపుదలలో గత ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి పురోగతి లేదని, సమైక్య రాష్ట్రంతో పోలిస్తే రేటు కార్డు ధరలు మరింత తగ్గిపోయాయని ఈ అన్యాయాన్ని సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డబ్ల్యూ జే ఐ అభిప్రాయపడింది.
- న్యూస్ ప్రింట్, ప్రింటింగ్ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఈ పరిస్థితుల్లో స్థానిక పత్రికల యాజమాన్యాలు పత్రికలు ముద్రించడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని సమావేశం అభిప్రాయపడింది. గత పదేళ్లలో పెద్ద పత్రికల టారిఫ్ ధరలు పెంచిన ప్రభుత్వం తెలంగాణ ఉద్యమానికి ఊతం ఇచ్చిన చిన్న పత్రికల విషయంలో చూపడం తగదని పేర్కొంది.
- స్థానిక పత్రికల ఎంప్యానల్మెంట్ విషయంలో ఏళ్ల తరబడి జాప్యం కొనసాగించడం తగదని, డిపిఆర్ఓ కార్యాలయాలు, సమాచార శాఖ కార్యాలయంలో పత్రికల హాజరు శాతాన్ని బట్టి ప్రతి ఆరు నెలలకు ఒకసారిఎంప్యానల్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఇప్పటివరకు ఎంప్యానల్మెంట్ కోసం పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు అన్నింటిని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేసింది.
- రోజురోజుకు పెరిగిపోతున్న మార్కెట్ ధరలకు అనుగుణంగా స్థానిక పత్రికలకు కేటాయించేప్రకటన రేట్లు సవరించాలని కోరింది. ప్రస్తుతం పది రూపాయల నుండి ఉన్న రేట్లలో మార్పు తీసుకురావలసిన అవసరం ఉందని అభిప్రాయపడింది.
- నివేశన స్థలాల కేటాయింపు, బలహీనవర్గాల గృహ నిర్మాణ పథకాల్లో పెద్ద పత్రికల జర్నలిస్టులతో సమానంగా, స్థానిక పత్రికల జర్నలిస్టులకు వాటా ఇవ్వాలని కోరింది.
- నివేశన స్థలాల కేటాయింపు సంబంధించి జరిపే సంప్రదింపుల్లో అన్ని జర్నలిస్టు సంఘాలకు సమాన భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేసింది.
- జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలను పెంపొందించడం కోసం రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, మీడియా, డెస్కు, వీడియో జర్నలిస్టులకు కార్యశాలలు నిర్వహించి,, వారికి ఉపయుక్తమైన సాహిత్యాన్ని ముద్రించాల్సిన బాధ్యతల నుంచి పూర్తిగా వైదొలగిన మీడియా అకాడమీ అధ్యక్షుడు ఇతర వ్యాపకాల్లో మునిగితేలడాన్ని డబ్ల్యూజేఐ ఆక్షేపించింది.



# విద్యా.. వైద్య రంగాల్లో క్రైస్తవ మిషనరీల సేవలు ప్రశంసనీయం

### కృతజ్ఞత మహిమోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్:**

ప్రపంచ వ్యాప్తంగా విద్య, వైద్య రంగాల్లో క్రైస్తవ మిషనరీలు విశేషమైన సేవలు అందిస్తూ బడుగు బలహీన వర్గాలకు చేరువై ప్రశంసలు అందుకుంటున్నారని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్వరి టెంపుల్ చర్చ్ పాస్టర్ డాక్టర్ పి.సతీష్ కుమార్ వాక్యపరిచర్యలో 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కృతజ్ఞత మహిమోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొని ప్రసంగించారు. ఇకనుంచి సమాజానికి నష్టం చేస్తున్న మాదక ద్రవ్యాలను రూపుమాపడంలోనూ క్రైస్తవ మతపెద్దలు తమ వంతు కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. యువత వ్యసనాలకు బానిస కావడం వల్ల సమాజానికి తీరని నష్టం వాటిల్లుతుందని, మాదక ద్రవ్యాలను రూపుమాపడంలో ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ దైవ సేవకుల సందేశాల్లోనూ ఈ అంశాన్ని ఒక బాధ్యతగా తీసుకుని మార్గనిర్దేశం చేయాలని సీఎం సూచించారు. భారతదేశం మత సామరస్యానికి ప్రతీక. ఎవరికి ఏ విశ్వాసంపై నమ్మకం ఉంటుందో ఆ విశ్వాసం ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ ఉందని రేవంత్ వ్యాఖ్యానించారు. ఆ స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, రాష్ట్రంలో మత వివక్షకు తావు లేదని స్పష్టం చేశారు. క్రైస్తవ మిషనరీస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న విద్యా సంస్థలు, ఆస్పత్రులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. భారతీయ సంస్కృతి ఎంతో బలమైనదని, కుల, మతాలకు అతీతంగా ఇక్కడ అందరికీ గౌరవం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు.



# కేటీఆర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

### నేతన్నల సంక్షేమంపై మంత్రి పొన్నం

**ప్రజాభూమి ప్రతినిధి, కరీంనగర్ కలెక్టరేట్:**

సిరిసిల్లలో నేత కార్మికుల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టంచేశారు. మంగళవారం ఆయన కరీంనగర్ కలెక్టరేట్‌లో మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కేటీఆర్ ఎమ్మెల్యేగా, తాను ఎంపీగా ఉన్నప్పుడు చేనేత కార్మికుల సమస్యల కోసం కలిసి పనిచేశామని గుర్తుచేసుకున్నారు. తనను రమ్మని కోరితే కేటీఆర్ వద్దకు వెళ్తానని చెప్పారు. నేత కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఎవరు సూచనలు, సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని తెలిపారు. ఇటీవల సిరిసిల్లలో జరిగిన కుటుంబం ఆత్మహత్యకు గతంలో చేసిన అప్పులే కారణమని నివేదికలందాయని పేర్కొన్నారు. రైస్ మిల్లర్ల నుంచి సీఎంఆర్‌కు సంబంధించి ఇంకా రూ.18 వేల కోట్ల విలువైన ధాన్యం రావాల్సి ఉన్నదని, అయినా ప్రభుత్వం తమను బద్నాం చేస్తున్నదంటూ మిల్లర్లు వ్యాఖ్యలు చేయడం సబబుకాదని చెప్పారు.

సమగ్ర ఇంటింటి సర్వేపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కుటుంబ యజమానికి నష్టం జరుగుతుందని భావిస్తే, సదరు సమాచారాన్ని ఇవ్వకపోయినా పరువాలేదని తెలిపారు. ఇది ప్రభుత్వ పరంగా జరుగుతున్న సర్వే అని, ప్రతి విషయం గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లను, సర్వేను పరిశీలిస్తున్న అధికారులను బెదిరింపులకు గురిచేసినా, వారిపై దాడులకు పాల్పడినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మండల సమాఖ్యల ఆధ్వర్యంలో రోడ్డు రవాణా సంస్థలో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మొదటి విడతగా 600 బస్సులు ఐకేపీ ద్వారా కొనుగోలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడి అత్యంత హేయనీయమని, విచారణకు రమ్మని నమ్మపలికి గ్రామస్థులతో కలిసి దాడి చేయడం న్యాయమేనా? దాడులతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందా? అని ప్రశ్నించారు.

# గవర్నర్ అనుమతి రాగానే కేటీఆర్‌పై చర్యలు : సీఎం రేవంత్‌రెడ్డి

**ఢిల్లీ:** ఢిల్లీలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ-రేస్ స్కామ్ నుంచి తప్పించుకొనేందుకే కేటీఆర్ ఢిల్లీ వచ్చారని అన్నారు. గవర్నర్ నుంచి అనుమతి రాగానే కేటీఆర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. గవర్నర్ అనుమతి నుంచి తప్పించుకోవడానికే కేటీఆర్ ఢిల్లీ వచ్చారన్నారు. అవినీతి పార్టీ భాజపాను అంతం చేస్తామన్న కేటీఆర్.. ఇప్పుడు ఆ పార్టీ నేతలను ఎలా కలుస్తున్నారని సీఎం ప్రశ్నించారు. భాజపా-భారాస చీకటి బంధం బయటపడుతుందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### ఇష్టమొచ్చిన చోట మొరపెట్టుకో కేటీఆర్..

"అమృత్ టెండర్లపై భారాస చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. రెడ్డి పేరు మీద ఉన్న వారం తానా బంధువులు కాదు. సృజన్ రెడ్డి భారాస మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి అల్లుడే. భారాస హయాంలో సృజన్ రెడ్డికి రూ.వేల కోట్ల పనులు కేటాయించారు.అమృత్ టెండర్లలో అవినీతి జరగలేదని ఉపేందర్ రెడ్డే చెప్పారు.ఈ టెండర్ల గురించి ఇష్టమొచ్చిన చోట మొరపెట్టుకో కేటీఆర్. కోర్టుల్లో కేసులు వేస్తా మన్నా.. వేసుకోండి" అని రేవంత్ రెడ్డి అన్నారు.

### నిందితులు ఎంతటివారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందే..

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడిని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. నిందితు లు ఎంతటివారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందేనని హెచ్చరించారు. దాడులు చేసిన వారి ని.. చేయించిన వారిని.. ఎవర్నీ వదలబోమని స్పష్టం చేశారు. ఇలాంటి దాడులు భారాస హయాంలో జరిగితే సమర్థిస్తారా? అధికారులపై దాడులను భారాస ఎందుకు ఖండించదు? అని ప్రశ్నించారు. పైగా దాడి చేసిన వారిని ఎలా పరామర్శిస్తారని, దాడులను ప్రోత్సహించేందుకే పరామర్శలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దంటే.. భాజపాకి సహకరించినట్లు కాదా? అని సీఎం ప్రశ్నించారు.

# కేటీఆర్ ఢిల్లీకి ఎందుకు పోతారో తెలుసు

### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్:**

వికారాబాద్ జిల్లా లగిచర్లలో కలెక్టర్‌పై దాడి వెనుక ఉన్న కుట్రను ఛేదిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఈ విషయమై శ్రీధర్‌బాబు మంగళవారం(నవంబర్ 12) సచివాలయం లో మీడియాతో మాట్లాడారు. పరిశ్రమలు రాకుండా ప్రతిపక్ష బీఆర్ఎస్ అశాం తిని రగులుస్తోంది.ప్రభుత్వ పరంగా ఎక్క డ తప్పు జరిగిందో తేల్చుతాం.లా అండ్ ఆర్డర్ విషయంలో వెనక్కి తగ్గేది లేదు.కేటీఆర్ అన్నంత మాత్రానా ఎవరికి ఎవరూ భయపడరు. రాజకీ యాల కోసం దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవు.

కేటీఆర్ ఢిల్లీకి ఎందుకు పోతారో అందరికీ తెలుసు.కేసుల నుంచి తప్పించాలని ఢిల్లీని వేడుకుంటున్నారు.అన్ని రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఏటీఎంగా ఉందా..మోదీ ఆరోపణలన్నీ రాజకీయ లబ్ది కోసమే. బీజేపీ,బీఆర్ఎస్ కలిసే పనిచేస్తున్నాయి'అని శ్రీధర్‌బాబు ఆరోపించారు.కాగా కలెక్టర్‌పై దాడి ఘటన మీద జిల్లా ఇంఛార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్,ఐజీ సత్యనారాయణ,ఎస్పీ నారాయణ రెడ్డి హాజరయ్యారు.ఘటన వివరాలను శ్రీధర్‌బాబు అడిగి తెలుసుకున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పోలీసుల తీరుపై శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఘటనపై రిపోర్టు ఇవ్వాలని డీజీపీ, సీఎస్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దాడిపై పోలీస్ శాఖ నివేదికను సిద్ధం చేస్తోంది.

# తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్.. మోదీ ఏం చేస్తున్నారు?

**ఢిల్లీ:** అమృత్ టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని.. అర్హత లేకపోయిన సీఎం బావమరిది సృజన్‌రెడ్డి కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు కేటాయించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు.అమృత్ టెండర్ల అవినీతిపై అన్ని ఆధారాలున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. నేను ఢిల్లీలో ఏ బాంబులు పేల్చడం లేదు. దీపావళి ఎప్పుడో అయిపోయింది. తెలంగాణలో బాంబు అన్నారు. ఏం జరగలేదు. తెలంగాణ కేటాయించిన రూ. 8,888 కోట్ల పనులపై విచారణ జరిపించాలి. అమృత్ టెండర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డారని కేంద్రానికి ఫిర్యాదు చేశాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

"ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని స్వయంగా ఆరోపించారు.

మరి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. రేవంత్‌రెడ్డి తన బావమరిదికి అమృతం పంచి.. కొండగల్ ఫార్మాతో ప్రజలకు విషం ఇస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా మేం ఢిల్లీకి వస్తాం.. దేశ ప్రజల దృష్టికి మీ మోసాలను తీసుకొస్తాం. మీ ఆరోపణల మీద మీకు నమ్మకం ఉంటే విచారణ జరిపించండి. తెలంగాణలో జరుగుతున్న అవినీతిపై ఎప్పటికప్పుడు ఢిల్లీకి వచ్చి ఎండగతా.

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఆర్ఆర్ అంటే రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ ట్యాక్స్" అంటే కేటీఆర్ చురకలు అంటించారు.

# దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి..

## మద్దతు ధర రాక రైతులు తమ పంటను దళారులకు అమ్ముకుంటున్న గడ్డుకాలం..

## ప్రజలు ఏం కోల్పోయారో చెప్పేందుకు నేను రెడీ..

## ఏం పొందారో చెప్పేందుకు సిద్ధమా.. రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు చాలెంజ్..

ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ

రాజరాజేశ్వరస్వామిని కొలుస్తారని.. రాజన్న మీద ఒట్టు పెట్టి రేవంత్ మాట తప్పాడని బిఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విమర్శించారు. వేములవాడ రాజన్న దర్శనం అనంతరం మంగళవారం వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చెల్మెడ లక్ష్మీ నరసింహారావు నివాసంలో మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. పాలకుడే పాపం చేస్తే ఆ రాష్ట్రానికి అరిష్టం పడుతుంది.. ప్రజలకు శాపంగా మారుతుందని తెలిపారు. అందుకే రేవంత్ చేసిన పాపం ప్రజలకు శాపం కావద్దని వేములవాడ రాజన్నకు మొక్కుకున్నానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం చేయాలని వేడుకున్నానని చెప్పారు.పంద్రాగస్టులోపు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పారని సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు.పంటలకు మద్దతు ధర రాక, అకాల వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. మద్దతు ధర రాకపోవడంతో రైతులు తమ పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.పౌరసరఫరాల శాఖ మంత్రిగా గంగుల కమలాకర్ ఉన్నప్పుడు, బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి గింజ దాకా కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణలో రైతులకు పండించిన వడ్లకు బోనస్ ఇచ్చామని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టిండని.. యాసంగి పంటకు అయినా రైతుబంధు ఇచ్చేలా చూడాలని దేవుణ్ని కోరుకున్నానని అన్నారు. దేవుళ్ల మీద ఒట్లు



పెట్టి మాట తప్పిన రేవంత్ రెడ్డి భయం లేదు.. భక్తి లేదన్న అనుమానం కలుగుతుందని వ్యాఖ్యానించారు.

ఆరు గ్యారంటీలు, 420 హామీలు అని ఎన్నికల ముందు చెప్పి.. అధికారంలోకి వచ్చాక మాట తప్పారని హరీశ్‌రావు అన్నారు. రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న వాళ్లు పై డబ్బు ఎందుకు కట్టాలి.. ఆ డబ్బు చెల్లిస్తేనే రుణమాఫీ చేస్తానన్న నిబంధన ఏంటని ప్రశ్నించారు. నువ్వు చేసిన తప్పుకు రైతులకు ఎందుకు శిక్ష వేస్తున్నావని నిలదీశారు. పాక్షికంగానే రుణమాఫీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 31 రకాల కారణాలు చెప్పి సగానికి పైగా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. తక్షణమే రుణమాఫీ చేసి, దేవుడి దగ్గర చెంపలు వేసుకోవాలని సూచించారు.కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం రేవంత్ రెడ్డికి లేదని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదు.. ప్రత్యేక రాష్ట్రం లేదు.. నువ్వు సీఎం అయ్యేవాడికి కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ అన్న మాటల్లో తప్పేముందని నిలదీశారు. మీ పాలనలో ప్రజలకు ఏం మేలు జరిగిందని ప్రశ్నించారు. ఈ 11 నెలల పాలనలో తెలంగాణ ప్రజలు ఏం కోల్పోయారో చెప్పడానికి రెడీ.. ఏం పొందారో చెప్పడానికి నువ్వు సిద్ధమా అని సవాలు విసిరారు. అప్పులు, రైతుల సమస్యలు, ఆస్పత్రులు, తాగు నీరు, సాగు నీరు, కరెంటు, విద్య, వైద్యం.. ఇలా అన్ని అంశాల్లో చర్చ చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు.రాష్ట్రంలో 36 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని హరీశ్‌రావు తెలిపారు. కొవిడ్ సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. కానీ మీ పాలనలో ఇప్పటికీ రైతుబంధు పడటం లేదని అన్నారు. పోలీసులే తమ పోలీసులు కొట్టేలా చేశావని పేర్కొన్నారు. నేతన్నలు ఆత్మహత్యల పాలు చేస్తున్నావని.. అశోక్ నగర్ లో నిరుద్యోగ యువతను వీపులు పగిలేలా కొట్టారని.. దళిత బంధు కోల్పోయారని.. రైతుబంధు కోల్పోయారని.. గొర్రెలు కోల్పోయారని.. చేప పిల్లలు కోల్పోయారని.. ఉద్యోగాలు కోల్పోయారని.. ప్రభుత్వ ఉద్యోగులు డీఏ కోల్పోయారని.. శాంతిభద్రతలు కోల్పోయారని.. జర్నలిస్టులు ప్రశ్నించే హక్కు కోల్పోయారని.. తెలంగాణ ప్రజలు ప్రశాంతతను కోల్పోయారని అన్నారు. మొత్తంగా తెలంగాణ నెంబర్ 1 స్థానం కోల్పోయిందని తెలిపారు. కేసీఆర్ పాలనలో తెలంగాన నంబర్ వన్ ఉంటే.. రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్డు మీదకు వచ్చారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా పగ, ప్రతీకారం మాని సీనియర్లను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ కోసం పోరాడింది బీఆర్ఎస్ పార్టీ అని.. కేసీఆర్ పదేళ్ల అభివృద్ధి చేస్తే.. రేవంత్ ఏడాది కాకముందే రాష్ట్రాన్ని పదేళ్ల వెనక్కి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రం మీద, పరిపాలన మీద దృష్టి పెట్టాలని సూచించారు.

ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయాలని.. రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, దేశపతి శ్రీనివాస్, ఎల్ రమణ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఆగన్న, వేములవాడ మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, సిరిగిరి చందు, కందుల క్రాంతి కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.



# హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి

## తిప్పారపు శ్రీనివాస్ సిపిఎం మండల కార్యదర్శి

ప్రజాభూమి ప్రతినిధి, బెజ్జంకి

బెజ్జంకి మండలం గుండారం గ్రామ సిపిఎం పార్టీ గ్రామ శాఖ సమావేశం లో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా,హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు లేకపోవడం మూలంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు,ప్రభుత్వం ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాల్లో హమాలీల పాత్ర కీలకమైనది కానీ హమాలీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలకు ఇన్సూరెన్స్ కట్టించి వారికి ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వమే ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని,ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయలు,పని దినాల కార్డులు కల్పించాలని,హమాలి కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్ది మల్లేశం,ఎలుక సంపత్,కొమురయ్య,రాజు,వెంకటేష్,అజయ్,అజ్జి,కిరణ్, మొండయ్య, మహేష్,ఉదయ్ పత్తి రమేష్,శ్రీనివాస్,శివాజీ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# వ్యాపారుల మోసాలను రైతులు పసిగట్టాలి

## న్యాయ విజ్ఞాన సదస్సు సెక్రటరీ రాధిక జైస్వాల్

ప్రజాభూమి ప్రతినిధి, ముస్తాబాద్:

వ్యాపారులు చేసే మోసాలను రైతులు ఎప్పటికప్పుడు పసి గట్టాలని న్యాయ విజ్ఞాన సదస్సు సెక్రటరీ రాధిక జైస్వాల్ అన్నారు. మంగళవారంముస్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతుల న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటల సాగు సమయంలో విత్తనాలు, పురుగుల మందులు, సంబంధిత అవసరాలను కొనుగోలు చేసే సమయంలో వ్యాపారులు చేసే మోసాలకు రైతులు గురికాకుండా ఉండటానికి చర్యలు తీసుకోవాలన్నారు.



# రాజన్న సేవలో మాజీ మంత్రి హరీష్ రావు

ప్రజాభూమి ప్రతినిధి వేములవాడ

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈవో వినోద్ రెడ్డి తో పాటు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. అర్చకులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ అధికారులు, నేతలు ఉన్నారు.

# బిజెపి దళిత మోర్చ మండల అధ్యక్షునిగా అయిలపాక సాగర్ నియామకం

ప్రజాభూమి ప్రతినిధి,చిగురుమామిడి




బిజెపి పార్టీ దళిత మోర్చ మండల అధ్యక్షునిగా నవాబుపేట గ్రామనికి చెందిన అయిలపాక సాగర్‌ను నియమించారు.ఈ సందర్భంగా బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. అనంతరం అయిలపాక సాగర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్థానని,మండలంలోని దళిత మోర్చ కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు,ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాం గోపాల్ రెడ్డి,మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు.

# కుల గణనపై ప్రతిపక్షాలవి అర్థంలేని ఆరోపణలు

## ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి హితవు

ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనపై ప్రతిపక్షాలు కువిమర్శలతో రాద్ధాంతం చేస్తున్నాయని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. కుల గణనకు ఎవరూ సాహసించని తరుణంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేపట్టాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడమే కాకుండా ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్రంలో కుల గణన చేపట్టిందని వివరించారు.



కులగణన చేపట్టడాన్ని స్వాగతించకుండా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు హేతుబద్ధతలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో గెలవడం కోసమేనని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించడాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి తప్పుబట్టారు. మహారాష్ట్ర ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఆగమేఘాలపైన కులగణన చేయిస్తున్నామనడంతో కేటీఆర్ కు రాజకీయ పరిపక్వత లేదని తేలిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. యాస, ప్రాసలతో నోటికేది వస్తే అది మాట్లాడితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని, ఆ నమ్మకం లేకనే ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కేటీఆర్ గుర్తించుకోవాలన్నారు. కుల గణన సర్వేపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. ఆ పార్టీ నాయకుల మాటల్లోనూ వైరుధ్యాలున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను మహారాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ధర్మపాల్ మేశ్రామ్ ఆ పార్టీ నాగ్‌పూర్ సభలో స్వాగతిస్తున్నట్టు ప్రకటించగా, తెలంగాణ కమలనాథులు మాత్రం కుల గణనపై కువిమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కుల వివక్ష, కుల వ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయనే సోయి ప్రతిపక్షాలకు లేకపోవడం విచారకమని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా విమర్శలు చేయడం ప్రతిపక్షాలకు పనిగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు.

కులాల గణన చేపట్టాలనే డిమాండ్ ముమ్మాటికీ న్యాయమైనదేనని, ఎప్పటికైనా దీన్ని చేపట్టాల్సిందేనని డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కుల గణనకు ఎదురవుతున్నట్లుగా చెబుతున్న సవాళ్లన్నీ ఊహాగానాలేనని ఆయన కొట్టి పారేశారు. అయితే, కుల గణనను చేపట్టడం ద్వారా ప్రభుత్వ పథకాలను అవసరమైన వర్గాలకు మెరుగ్గా చేరవేయడం సాధ్యమవుతుందన్నారు.

ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి కుల గణనను సహకరించాలని ఆయన ప్రతిపక్షాలను కోరారు.



# నాయి బ్రాహ్మణుల నిరసనకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి

ప్రజాభూమి ప్రతినిధి వేములవాడ

వేములవాడ పట్టణంలో కార్పొరేట్ సెలూన్లు ఏర్పాటుక అనుమతులు ఇవ్వకూడదని మూడు రోజుల పాటు నాయి బ్రాహ్మణులు దుకాణాలు బంద్ ప్రకటించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నేడు ర్యాలీ నిర్వహించిన నాయి బ్రాహ్మణులకు తెలంగాణ చౌక్లో సిద్దిపేట హరీశ్ రావు మద్దతు తెలుపుతూ వారికి అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తులకు పెద్దపీట వేసిందన్నారు.



# కోతి విగ్రహాన్ని ప్రతిష్టించిన గాంధీనగర్ యువకులు..

## విద్యుత్ షాక్ తో మృతి చెందిన కోతి..

## కోతి విగ్రహాన్ని అందజేసిన పోటు సుధీర్ రెడ్డి మౌనిక దంపతులు

## మహా అన్నప్రసాదం ఏర్పాటు..

ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి :

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో విద్యుత్ శాఖతో మృతి చెందిన కోతి విగ్రహాన్ని గాంధీనగర్ యూత్ సభ్యులు మంగళవారం ప్రతిష్టించారు.నవంబర్ 2న గాంధీ చౌరస్తా వద్ద విద్యుత్ షాక్ కు గురైన కోతిని కాపాడేందుకు గాంధీనగర్ యూత్ సభ్యులు చాలా ప్రయత్నం చేసినప్పటికీ ఆ కోతి రెండు రోజుల తర్వాత మృత్యువాత పడింది. దీంతో గాంధీనగర్ యూత్ సభ్యులు పొన్నం శ్రీనివాస్,ధరణి కన్స్ట్రక్షన్స్, నారాయణపురం శ్రీనివాస్, అనువోజు వెంకటరమణ,కోనేటి భాస్కర్, పన్యాల శ్రీధర్ రెడ్డి తదితరుల సహాయంతో కోతి గద్దెను నిర్మించారు.కీర్తిశేషులు పోటు కనకా రెడ్డి జ్ఞాపకార్థం పోటు సుధీర్ రెడ్డి మౌనిక కుటుంబ సభ్యులు కోతి విగ్రహాన్ని బహుకరించారు.అర్చకులు నాగయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం హనుమాన్ భక్తులకు, ప్రజలకు మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని బొమ్మ దేని రవీందర్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ యూత్ సభ్యులు చకిలంం శ్రీనివాస్,కాశవేణి రాజు, పెనుకుల తిరుపతి, గొడుగుల ఆంజనేయులు, కమిలికారి శ్యామ్, వద్లూరి నరేష్, పెనుకుల సంపత్, అనువోజు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



# బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

ప్రజాభూమి ప్రతినిధి వేములవాడ

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయానికి అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికిష్టమైన రోజు మంగళవారం నేపథ్యంలో బోనాల నైవేద్యాలు సమర్పించారు.అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. ధర్మ దర్శనంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్య వేక్షిస్తున్నారు.



# కంపు కొడుతున్న మోరీలు

## విజృంభిస్తున్న దోమలతో వార్డు ప్రజల సతమతం..

## అధికారుల నిర్లక్ష్యంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజల ఆవేదన...

ప్రజాభూమి ప్రతినిధి చిగురుమామిడి:

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని 12వ వార్డులో పారిశుధ్యంపై అధికారులు ఆలసత్యాన్ని ప్రదర్శిస్తున్నారని,ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకున్నపాపన పోలేదని ఆ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 12వ వార్డులోని బిఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో డ్రైనేజీ స్తంభించిపోయి మురుగునీరు దుర్వాసన వెదజలుతుందని దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తూ విష జ్వరాల బారిన పడుతున్నామని పెనుకుల సాయికిరణ్,మల్లం సదానందం,దాసరి రాజు,గుగ్గిళ్ల సత్తయ్య, పెనుకుల అనూష, మల్లం కళ్యాణి,పెనుకుల శ్రీనివాసులు మండిపడ్డారు.గ్రామపంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకున్న పాపను పోవడంలేదని, ఇండ్లలో చిన్న పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. దోమల నిర్మూలనకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని,దీంతో దోమలు ఇండ్లలోకి చేరి రాత్రి పగలు తేడా లేకుండా వాటి ప్రతాపం చూపిస్తున్నాయని మల్లం సదానందం,సాయికిరణ్ పేర్కొన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించి పారిశుధ్యం మెరుగుపరచాలని అధికారులను కోరుతున్నారు.



# సిరిసిల్లలో ఈనెల 13న మినీ జాబ్ మేళాం

ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్

ప్రముఖ ప్రైవేట్ కంపెనీ కేఎల్ టెక్నికల్ సర్వీస్ లో వేర్హౌస్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు కల్పించేందుకు సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి ఆధ్వర్యంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఈనెల 13న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ తెలిపారు. ఎస్ ఎస్ సి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 13న బయోడేటాలతో ఉదయం 11.00 గంటల వరకు రావాలన్నారు.నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ధాన్యం తరలింపు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్

## ధాన్యం తరలింపు వాహనాలు ఎక్కడ 6 గంటల మించి ఉండవద్దు

## సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు సర్టిఫై చేయాలి

## ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్

జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించే లా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ సంబం ధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ లతో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలు పై సమీక్ష నిర్వహించారు.సిరిసిల్ల జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం,రైస్ మిల్లులకు లేదా ఇంటర్మీడియట్ గోదాములకు తరలింపు తదితర అంశాల పై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ఇప్పటి వరకు 1488 మంది రైతుల నుంచి 107 కోట్ల 86 లక్షల విలువ చేసే 46 వేల 490 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 336 మంది రైతులకు 995 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 2 కోట్ల 30 ఒక లక్ష నిధులు చెల్లించామని తెలిపారు.ధాన్యం కొనుగోలు అంశంలో రాష్ట్రంలోనే సిరిసిల్ల జిల్లా 5వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు.రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు లేదా ఇంటర్మీడియట్ గోదాములకు తరలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అకాల వర్షాల కారణంగా పంట నష్టం పోయే అవకాశం ఉందని , ఈ నేపథ్యంలో ధాన్యం తరలింపు ఆలస్యం వహించ వద్దని అన్నారు.

ధాన్యం తరలింపు కోసం ఎక్కడ వాహనాల సమస్య ఉండకుండా చర్యలు తీసుకోవాలని,అవసరమైన మేర వాహనాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.ధాన్యం తరలింపు కేటాయించిన వాహనాలు ఎక్కడ 6 గంటల కంటే ఎక్కువ ఆగడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు.రైస్ మిల్లులు ధాన్యం దింపడంలో ఎక్కడైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే ఇంటర్మీడియట్ గోదాములకు ధాన్యం తరలించాలని కలెక్టర్ సూచించారు.ధాన్యం తరలింపు వాహనాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలని కలెక్టర్ సూచించారు.300 క్వింటాళ్ల ధాన్యం కంటే అధికంగా కొనుగోలు చేసిన కేంద్రాల నుంచి వెంటనే ధాన్యం తరలించాలని కలెక్టర్ ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటల లోగా ధాన్యం డబ్బులు లభించేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు సర్టిఫై చేయాలని కలెక్టర్ సూచించారు.గంభీరావుపేట, ఇల్లంతకుంట,ముస్తాబాద్,ఎల్లారెడ్డిపేట, తంగళ్ళపల్లి మండలాల్లో రైస్ మిల్లులకు ఇంచార్జి కేటాయించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్,డి.ఆర్.డి. ఓ.శేషాద్రి , డి.సి.ఎస్.ఓ. వసంత లక్ష్మి, డి.ఎం. సివిల్ సప్లైరజిత,డి.సి.ఓ రామకృష్ణ , డి.ఎం.సి.మెప్మ రాజేశం,డి.సి.ఎం.ఎస్. సెంటర్ ఇన్చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో సర్వే పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణ

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్

## జిల్లాలో 26 శాతం సర్వే పూర్తి

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ జిల్లాలో సకాలంలో పూర్తి చేసేలా అధికారులు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని, ప్రతి రోజు నిర్దిష్ట లక్ష్యం మేరకు ఇండ్ల సర్వే జరగాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ లతో కలిసి సంబంధిత అధికారులతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై సమీక్ష నిర్వహించారు.సిరిసిల్ల జిల్లాలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు,ఎదురవుతున్న ఇబ్బందులు,చేపట్టాల్సిన చర్యలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ...రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న 1531 ఈబీ బ్లాక్ లలో 1 లక్షా 92 వేల 432 ఇండ్లలో సర్వే చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు మొత్తం 49 వేల 918 ఇండ్లలో (26 శాతం) సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు.గంభీరావుపేట, ముస్తాబాద్,ఎల్లారెడ్డిపేట,బోయినపల్లి మండలాల్లో సర్వే నిర్వహణలో వేగం పెంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతిరోజు సకాలంలో ఎన్యుమరేషన్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు.మండలాల్లో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్ లతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ,టీచర్ల స్థానం లో రిజర్వ్ సిబ్బంది వాడుకొని సర్వే వేగంగా జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.ప్రజల నుంచి స్వచ్ఛందంగా మాత్రమే సమాచారం తీసుకోవాలని ఎక్కడ ఎటువంటి సమాచారానికి బలవంతం చేయవద్దని కలెక్టర్ సూచించారు.సర్వే కారణంగా ఎటువంటి పథకాలు కోల్పోమని ప్రజలకు భరోసా కల్పించాలని, అపోహలు తొలగిస్తూ ప్రజల నుంచి సమాచారం సేకరించాలని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో వేములవాడ, సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారులు రాజేశ్వర్,వెంకట ఉపేందర్ రెడ్డి,మండల ప్రత్యేక అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత..

ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్

ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కొమ్మేట రేణుక-ఏల్లయ్య రెండవ కూతురు భార్గవి వివాహం బుధవారం జరుగనున్న నేపథ్యంలో గూడెం గ్రామవాసి చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు విద్యాసాగర్ రావుకి ఇట్టి పరిస్థితిని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోమ్మటి రాజమల్లు తెలుపగా మంచి మనస్సుతో ఆ నిరుపేద కుటుంబానికి పుస్తె-మట్టెలు చీరని అందిచారు.అలాగే చిప్పలపల్లి గ్రామానికి చెందిన పూరం శ్రీనివాస్ రెడ్డి తండ్రి చంద్ర రెడ్డి నిరుపేద కుటుంబానికి 50 కేజీల బియ్యం,గాడిచర్ల కిషన్ 50 కేజీల బియ్యం,ప్యాక్స్ డైరెక్టర్ గాడిచేర్ల రామచంద్రము 25 కిలోల బియ్యం ఆ నిరుపేద కుటుంబానికి అందించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాదవి వెంకటేశ్వర్ రావుకి,చిప్పలపల్లి గ్రామానికి చెందిన దాతలకు ధన్యవాదములు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ గాడిచర్ల రామచంద్రం చిలివేరి స్వామి,కొమ్మెట శ్రీనివాస్, మద్దికుంట పోచయ్య, పొన్నాల లింగం, బొమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ వీరభద్ర ఇండస్ట్రీలో వైభవోపేతంగా అయ్యప్ప పడిపూజ

ప్రజాభూమి ప్రతినిధి,సంగారెడ్డి



శ్రీ వీరభద్ర ఇండస్ట్రీలో సురేష్ గురు స్వామి, నవీన్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. కన్నయ్య పంతులు వేద మంత్రోచ్చారణల మధ్య అయ్యప్ప పడిపూజను వైభవంగా జరిపారు. స్వామి వారికి అభిషేకం, పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పెద్దెనిమిది మెట్లు వెలగించి హారతి కర్పూరం వెలిగించారు.మణికంఠ భజన మండలి సంగారెడ్డి వారు పాడిన అడయ్య ఆడయ్య ఓ కన్నెస్వామి, నిను చూసి ఆడుతాడు మనికంఠస్వామి అనే పాటకి ఆ ప్రాంగణం మొత్తం మారు మ్రోగింది.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు..

# శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

## సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కొత్త వినీత రెడ్డి...

## పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న దంపతులు..

ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి:



కోరిన కోరికలు తీరుస్తూ కొంగు బంగారంగా వెలు గొందుతున్నటువంటి శ్రీస్వయంభు పాంబండ పంచ ముఖ ఆంజనేయ స్వామి వారి దివ్య క్షేత్రంలో కార్తీక మాస శుద్ధ ఏకాదశి తిధిని పురస్కరించుకొని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజా కార్యక్రమంలు శ్రీశ్రీశ్రీ పూజ్య గురూజీ హూమేష్ స్వామీజీ ఆధ్వర్యంలో అత్యంత వైభవపీతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి,శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యే శ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త వినీతరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,తేరాల సత్య నారాయణ, మోహన్ రెడ్డి,ముక్కెర సదానందం,తేరాల అమర్,ప్రవీణ్ కుమార్, సంపత్ కుమార్,రాజు, సురేష్, బొల్ల బత్తిని సంతోష్, శ్రీమాన్ ఆంజనేయులు ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరూపయోగంగా నాంపల్లి బస్టాండ్

ప్రజాభూమి ప్రతినిది వేములవాడ రూరల్

వేములవాడ రూరల్ మండలంలోని నాంపల్లి బస్టాండ్ కొన్ని ఏళ్ల నుంచి నిరూపయోగంగా ఉంది. ఈ బస్టాండ్ ఇలా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం ఎండలో, వానలో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్ను ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# సీఎంగానే కాదు ఎమ్మెల్యేగా కూడా రేవంత్‌రెడ్డి ఫెయిల్

- 300 అడుగుల రహదారి ఎందుకని ప్రశ్న
- భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్
- అగర్‌మియాగూడలో రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే సబితారెడ్డి



**ప్రజాభూమి ప్రతినిధిరంగారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో రైతులతో పాటు అధికారులు బాధపడుతున్నారని, రేవంత్‌రెడ్డి సీఎంగానే కాదు ఎమ్మెల్యేగా కూడా ఫెయిల్ అయ్యారని స్తానిక ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని అగర్‌మియాగూడలో మాజీ సర్పంచులు ఈ.భూపాల్‌రెడ్డి, ఎన్.నారాయణ, రైతులు ఎన్.శ్రీకాంత్, డి.సుధాకర్‌రెడ్డి, లిక్కి జంగారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఫోర్త్‌సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు మద్దతుగా సబితారెడ్డి హాజరై మాట్లాడారు. ఫోర్త్‌సిటీ పేరుతో రియల్ వ్యాపారం చేసుకోవడానికే 300 అడుగుల రహదారి చేపడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ హాయాంలో రైతులు నష్టపోవద్దనే ఉద్దేశ్యంతో అప్పట్లో ప్రతిపాదించిన వంద అడుగుల రోడ్డును నిర్మించలేదన్నారు. శ్రీశైలం రహదారి నుంచి నేరుగా ఫార్మాసిటీలోకి రోడ్డును వేశామన్నారు. శ్రీశైలం రహదారిని 8 వరుసలుగా విస్తరించనున్నారని, ఆ రోడ్డుతో పాటు గతంలో నిర్మించిన 200 అడుగుల రహదారి ఉందన్నారు. అన్ని వైపులా అక్కడికి చేరుకునేలా రహదారులు ఉండగా కొత్తగా 300 అడుగుల రహదారి ఎందుకని ప్రశ్నించారు. ఆ రహదారి నిర్మాణంతో 2 వేల రైతు కుటుంబాలు రోడ్డున పడనున్నాయన్నారు. తాము తుక్కుగూడ నుంచి నేషనల్ హైవే మీదుగా మెట్రో నిర్మించాలని గతంలో తలపెడితే ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని మార్చి రైతులకు ఇబ్బందులు కలుగజేస్తున్నాడని విమర్శించారు. ఓ పక్క ఫార్మాసిటీ రద్దు చేశామని బయట చెబుతున్నారని, మరోపక్క కోర్టులో మాత్రం రద్దు చేయలేదని చెబుతున్నారన్నారు. ఫార్మాసిటీ రద్దు చేశారా లేక కొనసాగిస్తున్నారా? అనే విషయాన్ని ముందు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత మంత్రులు సీతక్క, బట్టి విక్రమార్క తదితరులు ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల భూములు తిరిగి ఇస్తామని చెప్పారని, ఇప్పుడు ఎందుకు ఆ పని చేయడంలేదని ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో అధికారులపై కోపంతో రైతులు చేసిన దాడి కాదని, అది సీఎంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు.

### భూమికి భూమి ఇవ్వాలి......

300 అడుగుల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఎకరం బహిరంగ మార్కెట్‌లో రూ.5 కోట్ల వరకు పలుకుతుందని, ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ ధరకు మూడు రెట్లకు మించి ఇవ్వదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారన్నారు. అవసరం లేకపోయినా రోడ్డు వేసి రైతుల ఉసురుపోసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ 8 నెలల పాలనలో రైతులను ఇబ్బంది పెట్టి రాక్షసానందం పొందుతున్నారన్నారు. రహదారి నిర్మాణానికి భూసేకరణను అడ్డుకునేలా అవసరమైతే న్యాయస్థానంకు రైతుల తరపున వెళతామన్నారు. రైతులకు అందరం అండగా నిలబడదామని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి నిర్మాణం కోసం పొలాల్లో భూసేకరణకు వేసిన గుర్తులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, గణేష్, దేవేందర్, సీనియర్ నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ, రేవంత్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, వెంకటేష్‌గౌడ్, సదానంద్‌గౌడ్, సామయ్య, దర్శన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రామకృష్ణ, రైతులు బీరప్ప, జగన్‌మోహన్‌రావు, కె.జంగయ్య, ఐలయ్య, యాదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌పై దాడికి కీలక పాత్రదారి పట్నం నరేందర్?

(మొదటి పేజీ తరువాయి)

విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. దీంతో వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడికి వెనుక ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ నేత కేటీఆర్, పట్నం నరేందర్ రెడ్డి ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ నాయక్, కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఒక డిఎస్పి పై తీవ్రంగా దాడి జరిగింది. గత రెండు రోజులుగా దుద్యాల, కొడంగల్, బోంరాస్ పేట మండలాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

### లగచర్ల గ్రామంలో15 మంది రైతులను అరెస్ట్ చేసిన పోలీసులు

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ను సురేష్ నమ్మించి గ్రామంలోకి తీసుకెళ్లాడని, .కలెక్టర్ పై ఉద్దేశపూర్వకంగా ముందస్తు ప్రణాళికతో దాడి జరిగిందని ఐజి వి సత్యనారాయణ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. లగచర్ల గ్రామంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ నాయక్, కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఒక డిఎస్పి పై తీవ్రంగా దాడి చేశారని ఆయన తెలిపారు. భోగముని సురేష్ అనే వ్యక్తి కలెక్టర్ గారిని నమ్మించి రైతుల వద్దకు తీసుకెళ్లడం వల్లే కొందరు ముందస్తు ప్రణాళికతో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేశారని ఐజి సత్యనారాయణ తెలిపారు. ఈ దాడిలో సుమారు 100మందకిపైగా వ్యక్తులు ఉన్నారని, స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులపై దాడికి పాల్పడిన వారు ఎంతటి వారినై ఉపేక్షించబోమని, వారిపై



చట్టరీత్య చర్యలు చూసుకుంటామని స్పష్టం చేశారు. ఫార్మాసిటీ కోసం భూసేకరణ విషయంలో కలెక్టర్ మాట్లాడుతుండగా కొంతమంది ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని చెప్పారు. ఈ దాడికి ఎంతటికి సురేష్ మరి అతని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరో తెలుసుకుంటున్నామని, ఇప్పటివరకు 15 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ లింగయ్య నాయక్ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని, మిగతా వారికి స్వల్ప గాయాలు అయినట్లు పేర్కొన్నారు. కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి కి బలమైన గాయాలు అయ్యాయని కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ఆయనపై దాడి చేశారని ఐజీ సత్యనారాయణ వెల్లడించారు. దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులను పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, ఫార్మా కంపెనీ ఏర్పాటుపై గ్రామస్థుల అభిప్రాయ సేకరణ కు వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఇతర అధికారుల వాహనాలపై రాళ్ళతో రైతుల దాడి చేశారని చెప్పారు. . దుద్యాల, లగచర్ల పోలేపల్లి, లగచర్ల తాండలో ఫార్మా కంపెనీల ఏర్పాటుపై రైతులతో చర్చించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్, అధికారుల పైన ఇలాంటి దాడులు జరగడం విచారకరమని, త్వరలో అందర్నీ అదుపులోకి తీసుకుంటామని ఐజీ సత్యనారాయణ హామీ ఇచ్చారు.

### నిఘా విఫలం కావడంపై శ్రీదర్‌బాబు సీరియస్

వికారాబాద్ జిల్లాల ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు స్థలసేకరణ కోసం జిల్లా కొడంగల్‌లోని దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో రైతుల పేరుతో వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ నాయక్, కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఒక డిఎస్పి పై జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు. మంగళవారంవ ఉదయం వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఐజితో జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు సమావేశమైన నిఘా వైఫల్యం పై అసహనం వ్యక్తం చేశారు. నిఘా విభాగం ఏం చేస్తుందంటూ అధికారుల అధికారులను నిలదీశారు. రౌడీయిజం, గుండాయిజంతో ప్రభుత్వ అధికారులను బెదిరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. దాడి కోసం పదిరోజుల ముందు నుండి ఎవరు ఎలా ప్లాన్ చేశారో త్వరలో బయటపెడతామని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. మేం వేసే ప్రతి అడుగులో ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేద్దామంటే వాటిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారు. ఉన్నతాధికారులపై దాడి వెనక ఎవరున్నారో, రాష్ట్రం అభివృద్ధి కాకుండా చేయాలని ఎవరు చూస్తున్నారో బయటపెడుతాం.

### డీజీపీకి ఫిర్యాదు చేసిన ఉద్యోగ సంఘాల జేఏసీ

వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ నాయక్, కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఒక డిఎస్పి పై జరిగిన దాడి ఘటనపై తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు డీజీపీ డాక్టర్ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం జేఏసీ చైర్మన్ లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు డీజీపీకి లిఖితపూర్వ ఫిర్యాదును అందజేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో పాటు ఇతర ఉన్నతాధికారులపై జరిగిన దాడి పై సమగ్ర విచారణ జరిపించాలని జేఏసీ నేతలు కోరారు.

### కలెక్టర్ పై జరిగిన దాడిని ఖండించిన

**టీజీఈజేఏసీ- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్**

విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఇతర అధికారులపై రైతుల పేరుతో జరిపిన దాడిని నిరసిస్తూ జిల్లా ఉద్యోగులు అధికారులు ధర్నా చేపట్టి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా టీజీఈజేఏసీ సెక్రెటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ రావు వికారాబాద్ జిల్లా ఐడీఓసీ కార్యాలయానికి వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ధర్నా కార్యక్రమంలో ట్రెసా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వంగా రవీందర్ రెడ్డి, గౌతమ్, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు బి. శ్యామ్, టీజీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డా.కె. రామారావు, వికారాబాద్ జిల్లా టీఎన్‌జీవో అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అజ్మద్ పాషా జిల్లా ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్మీనియా నుంచి తిరిగొచ్చిన జగిత్యాల వాసి

- యూరప్‌లో ఉద్యోగమంటూ నమ్మించి రూ.3.50లక్షలకు మోసం
- ప్రవాసీ ప్రజావాణిలో రాములు ఫిర్యాదు
- ప్రజావాణికి మొత్తం 748 దరఖాస్తులు

**ప్రజా భూమి ప్రతినిధి, హైదరాబాద్:** ఏజెంట్ చేతిలో మోసపోయి అతి కష్టం మీద ఆర్మీనియా నుంచి  తిరిగి వచ్చినట్టు జగిత్యాలకు చెందిన కూన రాములు ప్రవాసీ ప్రజావాణిలో వాపోయారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ ప్రవాసీ ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరప్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3.50లక్షలు తీసుకున్న ఏజెంట్ ఆర్మీనియా తీసుకెళ్లారన్నారు. అక్కడ ఉద్యోగం ఇప్పించకుండానే తనను ఇండియాకు వాపస్ పంపించారని ఆవేదన చెందారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం అయితుపల్లికి చెందిన తాను జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఒక లైసెన్సుడ్ ఏజెన్సీ ద్వారా గత ఏడాది సెప్టెంబరు25న ఆర్మీనియాకు వెల్లినట్టు తెలిపారు. అక్కడ ఉద్యోగం లభించకపోవడంతో ఈ ఏడాది జనవరి30న జగిత్యాలకు తిరిగి వచ్చినట్టు చెప్పారు. ఆర్మీనియా నుంచి వాపస్ రావడానికి తనకు 1.45లక్షలు ఖర్చు అయిందని వాపోయారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాల్సిందిగా ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజావాణిలో మొత్తం 748 దరఖాస్తులు అందాయి.



అందులో మైనార్టీ వెల్ఫేర్ శాఖ సంబంధించి 420 అర్జీలు ఉన్నాయి. వాటిలో చాలా వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కోరుతూ దాఖలు చేసుకున్న దరఖాస్తులే అత్యధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కు 110, విద్యుత్ శాఖ కు 80, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 59, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏ, యూడీ)శాఖ సంబంధించి 14, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 02, ఇతర శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జీ డాక్టర్ జీ చిన్నారెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



## వామ్మో ఎలుగుబంటి...

# ఆదమరిస్తే అంతే

### గన్నేరువరంలోని పలు గ్రామాల్లో ఎలుగుబంట్ల సంచారం

### భయాందోళనలో ప్రజలు

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం**

గన్నేరువరం మండలంలో ఎలుగుబంట్ల సంచారం ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.. గన్నేరువరం, మైలారం, హన్మజిపల్లి, జంగపల్లి, మాదాపూర్, చొక్కాలపల్లి గ్రామాల్లో ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉందని, పలుసార్లు ప్రజలపై ఎలుగుబంట్లు దాడి చేసిన సందర్భాలు ఉన్నాయాని ప్రజలు భయాందోళనలో ఉన్నారు. తాజాగా మంగళవారం రాత్రి ఎలుగుబంటి ఖాసీంపెట్- చాకలివానిపల్లి మార్గంలో వెళ్తున్న వాహనదారులకు కనిపించడంతో జనం బెంబేలెత్తుతున్నారు. మంగళవారం రాత్రి గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజయ్య గౌడ్ కాశింపెట్ నుండి చాకలివానిపల్లి వెళ్లే మార్గంలో పాలను సరఫరా చేస్తూ తరలిస్తున్న తరుణంలో ఎలుగుబంటి వాహనానికి అడ్డుగా వచ్చిందని,దీంతో ఆయన తన మొబైల్ లో ఎలుగుబంటి చిత్రాన్ని ఫోటో తీసి వాట్సప్ గ్రూపులో షేర్ చేయడం తో విషయం హాట్ టాపిక్ గా మారింది. వాహనానికి అడ్డుగా ఉందని ,ఎంతకు కదలకపోవడంతో గట్టిగా అరిచానని దీంతో సమీప పొదల్లోకి వెళ్లిందన్నారు. ఎలుగుబంటి సంచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రాత్రివేళల్లో ప్రయాణిస్తున్నవారు జాగ్రత్తగా ఉండాలని , ఆదమరిస్తే పెను ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అటు ప్రజలు సైతం గ్రామాల్లో సంచారిస్తున్న ఎలుగుబంట్లను   పట్టుకుని బంధించాలని ప్రజలు కోరుతున్నారు.

# కలుషిత ఆహారం తిని విద్యార్థులకు తీవ్ర అస్వస్థత

**ప్రజా భూమి ప్రతినిధి, తిమ్మాపూర్ :**

తిమ్మాపూర్ మండలం లోని రామకృష్ణ కాలనీ లో గల జ్యోతిబాపులే బాలుర హాస్టల్ లో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకొని హాస్టల్ వద్దకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు.  పిల్లలను విచారించగా ఉడికి ఉడకని అన్నం, గడ్డలు కట్టి ముద్దాలుగా అవుతుందని తెలిసినా  అదే అన్నం విద్యార్థులకు  వడ్డిస్తున్నారని , దీంతో అన్నం సరీగా తినలేక పస్తులుంటున్నామని, ఆకలికి తాళక ముద్దాల అన్నము తినడంతో కడుపునొప్పి, విరోచనాలు అవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించి గోప్యంగా పిల్లలను ఆస్పత్రికి తరలించారని సమాచారం.

## మందకొడిగా జేఈఈ మెయిన్

# దరఖాస్తు ప్రక్రియ

### సాంకేతిక సమస్యలే కారణం!

**న్యూఢిల్లీ, నవంబర్ 12:** జేఈఈ మెయిన్ సెషన్-1 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మందకొడిగా కొనసాగుతున్నది. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా కేవలం 5.1 లక్షల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గత ఏడాది దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించిన మొదటి రెండు వారాల్లో దాదాపు 12.21 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఇంత భారీ తేడా ఉండటానికి సాంకేతిక సమస్యలే కారణమని నిపుణులు భావిస్తున్నారు. సాంకేతిక సమస్యల వల్ల రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ఆలస్యంగా సాగుతున్నదని చెప్తున్నారు. నవంబర్ 22 వరకే గడువు ఉన్నప్పటికీ ఇంత తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఎన్‌టీఏ సమీక్షించి వేగంగా దరఖాస్తు ప్రక్రియలో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

# బిజినెస్ క్లా'స్'ష్



**దేశీయ విమానయాన రంగంలో రెండు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దేశంలో పూర్తిస్థాయి విమానయాన సంస్థలుగా ఉన్న ఎయిరిండియా, విస్తారా విలీనమై.. మంగళవారం నుంచి ఎయిరిండియా ఒక్కటే ఈ సేవలందించనుంది.**

దేశీయ విమానయాన రంగంలో రెండు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దేశంలో పూర్తిస్థాయి విమానయాన సంస్థలుగా ఉన్న ఎయిరిండియా, విస్తారా విలీనమై.. మంగళవారం నుంచి ఎయిరిండియా ఒక్కటే ఈ సేవలందించనుంది. దేశీయ విమాన ప్రయాణికుల్లో ఈ 2 సంస్థల వాటా కలిపితే దాదాపు 25% అవుతుంది. చౌకధరల సంస్థగా ఉండి, దేశీయ విపణిలో 63% వాటా కలిగిన ఇండిగో.. బిజినెస్ క్లాస్ విభాగంలో పోటీకి సన్నద్ధమవుతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న విమానయాన విపణిగా నిలిచిన మన దేశంలో, ఈ పరిణామాలను పరిశ్రమ వర్గాలు కీలకమైన మార్పులుగా పేర్కొంటున్నాయి.

### యూకే కోడ్‌కు స్వస్తి

విస్తారా బ్రాండ్ సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు చెందినది కాగా, టాటా గ్రూప్ భాగస్వామ్యంతో.. దేశీయంగా ప్రీమియం సర్వీసుగా విస్తారా విమానాలు నడిచాయి. విస్తారా విమాన సర్వీసులు సోమవారం (ఈ నెల 11తో) ముగిశాయి. ఈ సంస్థ చివరి సర్వీసులుగా ముంబయి నుంచి దిల్లీకి యూకే 986 విమానం, దిల్లీ నుంచి సింగపూర్‌కు యూకే 115 విమానాలు నడిచాయి.

ఎయిరిండియా, విస్తారా విలీనానంతరం తొలి విమానం.. సోమవారం అర్ధరాత్రి దాటాక, 12.15 గంటలకు (మంగళవారం నాడు) దోహాలో బయలుదేరి, ముంబయి వస్తోంది. ఈ విమానం కోడ్ 'యూకే' బదులు 'ఏఐ2' కు మారింది. దేశీయంగా చూస్తే అర్ధరాత్రి 1.20 గంటలకు ముంబయి నుంచి దిల్లీకి తొలి సర్వీస్ వెళ్తుంది.

### ప్రీమియం సేవలు కొనసాగిస్తేనే

నష్టాల్లో ఉన్న ఎయిరిండియాను కేంద్ర ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన టాటా గ్రూపు.. భాగస్వామ్య సంస్థలతో కలిపి తాము నిర్వహిస్తున్న ఎయిరేషియా, విస్తారా బ్రాండ్ విమానయాన సంస్థలను ఎయిరిండియా గ్రూప్‌లో విలీనం చేసింది. దేశీయంగా అతిపెద్ద, లాభదాయక విమానయాన సంస్థగా ఎయిరిండియాను తీర్చిదిద్దేందుకే ఈ విలీన ప్రక్రియ చేపట్టింది. విస్తారా మాదిరిగా ఉన్నత ప్రమాణాలతో సేవలందిస్తేనే ప్రీమియం ప్రయాణికులను ఆకట్టుకోవడం ఎయిరిండియాకు సాధ్యపడుతుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. విస్తారా విమానాల్లో ఎంతో ఆకర్షణీయంగా ఫ్లాట్ బెడ్ సీట్లు, ప్రీమియం ఎకానమీ క్యాబిన్ సదుపాయాలను గుర్తు చేసుకుంటున్నారు.

### విలీనానంతరమూ..

విలీనం తరవాతా విస్తారా మార్గాలు, ఇన్-ఫ్లైట్ సేవలు, సిబ్బంది యథాతథంగా కొనసాగే అవకాశం ఉంది. ఇవన్నీ ఎయిరిండియాలో భాగం కావడమే ప్రధాన మార్పు. సింగపూర్ ఎయిర్‌లైన్స్, టాటా గ్రూపు భాగస్వామ్యంతో విస్తారా మనదేశంలో 2015లో ప్రారంభమైంది. జెట్ ఎయిర్‌వేస్ 2019లో దివాలా తీశాక, విస్తారా సేవలు శరవేగంగా విస్తరించాయి. విస్తారా విలీనంతో టాటా గ్రూపు అజమాయిషీలోని ఎయిరిండియా వద్ద 210 విమానాలు ఉన్నట్లు అవుతోంది. బోయింగ్, ఎయిర్‌బస్ నుంచి మరో 470 విమానాల కొనుగోలుకు ఎయిరిండియా ఆర్డర్ ఇచ్చిన విషయం తెలిసిందే.

### ఈ తరగతి ఛార్జీల్లోనూ పోటీయే

ప్రీమియం సేవల విభాగంలోకి విస్తరించి, ఎయిరిండియాను సవాలు చేయాలని ఇండిగో భావిస్తోంది. ఇందుకోసమే దేశంలోని ప్రధాన మార్గాల విమానాల్లో బిజినెస్ క్లాస్ క్యాబిన్లు ప్రవేశపెడుతోంది. లాయల్టీ ప్రోగ్రామ్‌తో పాటు కొన్ని గమ్యస్థానాల్లో 'ఇండిగో స్ట్రెచ్' బిజినెస్ సీట్లను ప్రవేశపెట్టింది. రద్దీగా ఉండే దిల్లీ - ముంబయి మార్గంలో 2025 జనవరి కల్లా అన్ని విమాన సర్వీసుల్లో బిజినెస్ క్లాస్ సేవలు అందించాలనేది ఇండిగో లక్ష్యం. ప్రయారిటీ చెక్‌ఇన్, బ్యాగేజ్ అలవెన్స్, రిక్లైనర్ సీట్లు, రుచికరమైన ఆహారం, మరెన్నో సదుపాయాలు ఈ తరగతి ప్రయాణికులకు లభిస్తాయి. ఎయిరిండియా కంటే తక్కువ ధరకే బిజినెస్‌క్లాస్ సదుపాయాలను అందించాలని ఇండిగో సంకల్పించడం ముఖ్యమైన అంశం.



## భారీ నష్టాల్లో సూచీలు.. మళ్లీ 24వేల దిగువకు నిఫ్టీ..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 820 పాయింట్లు, నిఫ్టీ 257 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 800 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 24వేల దిగువకు చేరింది. నిరాశజనక త్రైమాసిక ఫలితాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం లాభాల్లో ట్రేడయినప్పటికీ.. గరిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడంతో సూచీలు భారీగా కుంగాయి. ఈ సాయంత్రం ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీ మొత్తం విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు ఆవిరై రూ.436 లక్షల కోట్లకు చేరింది.

బడ్జెట్‌కు సిద్ధమవుతోన్న నిర్మలమ్మ.. వచ్చే నెల రాష్ట్రాల ఆర్థికమంత్రులతో భేటీ

సెన్సెక్స్ ఉదయం 79,644.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,496.15) లాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా లాభాల్లో కొనసాగిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 78,547.84 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 820.97 పాయింట్ల నష్టంతో 78,675.18 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 257 పాయింట్ల నష్టంతో 23,883.45 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠమైన 84.40కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా, టాటా మోటార్స్ సేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

## ఈ యాపిల్ డివైజ్‌లు వాడుతున్న వారికి కేంద్రం 'హైరిస్క్' అలర్ట్!

యాపిల్ కంపెనీకి చెందిన ఐఫోన్స్, మ్యాక్స్, యాపిల్ వాచీలు వాడుతున్నవారిని కేంద్రం అలర్ట్ చేసింది. ఔట్‌డేటెడ్ సాఫ్ట్‌వేర్ వాడుతున్న డివైజుల్లో సెక్యూరిటీ లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ఈమేరకు ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వశాఖ పరిధిలోని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ అడ్వైజరీని జారీ చేసింది. ఆయా డివైజులు వాడుతున్న వారికి 'హైరిస్క్' పొంచి ఉ



న్నట్లు పేర్కొంది. పాత సాఫ్ట్‌వేర్‌లో సెక్యూరిటీ లోపాల కారణంగా యాపిల్ డివైజుల్లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా చొరబడి సెన్సిటివ్ డేటాను యాక్సెస్ చేయడం లేదా డేటా మానిప్యులేషన్‌కు పాల్పడే అవకాశం ఉందని సెర్ట్-ఇన్ పేర్కొంది. ఐఓస్ 18.1 కంటే ముందు వెర్షన్ లేదా 17.7.1 కలిగిన ఐఫోన్లు, ఐప్యాడ్‌ఓఎస్ 18.1 కంటే ముందు లేదా 17.7.1 వెర్షన్ కలిగిన ఐప్యాడ్‌లు, పాత మ్యాక్‌ఓఎస్ వాడుతున్న మ్యాక్‌లు, వాచ్ ఓఎస్ 11 కంటే ముందు సాఫ్ట్‌వేర్ కలిగిన యాపిల్ వాచ్‌లకు ఈ ప్రమాదం పొంచి ఉందని సెర్ట్-ఇన్ పేర్కొంది.వీటితో పాటు పాత టీవీఓఎస్, విజన్‌ఓఎస్, సఫారీ బ్రౌజర్లకూ ఇదేతరహా ముప్పు పొంచిఉందని సెర్ట్-ఇన్ పేర్కొంది. అయితే, సాఫ్ట్‌వేర్‌లో లోపాలను యాపిల్ ఇదివరకే గుర్తించి కొత్త సెక్యూరిటీ అప్‌డేట్‌లో పరిష్కారం చూపిందని తెలిపింది. ఇంకా ఎవరైనా పాత సాఫ్ట్‌వేర్ వెర్షన్లు వాడుతున్నారో వారు వెంటనే తమ డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

## ఓ రైతు.. రైలుకు ఓనరయ్యాడు..



**మన దేశంలో అత్యంత సంపన్నులైన వ్యక్తుల పేరిట విమానాలు, హెలికాప్టర్లు, ఓడలు వంటివి ఉన్నట్లు చదువుతుంటాం.. వింటుంటాం కదా! కానీ, ఒక రైలుకు ఫలనా వ్యక్తి యజమాని అని మీరెప్పుడైనా విన్నారా? విని ఉండరు. ఎందుకంటే మన దేశంలో అది అసాధ్యం. భారతీయ రైల్వేలు పూర్తిగా ప్రభుత్వ ఆస్తిగానే కొనసాగుతున్నాయి. కానీ, గతంలో రైల్వే అధికారులు చేసిన ఒక పొరపాటుతో స్వర్ణ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక రైతు కొన్నాళ్లు యజమానిగా ఉండాల్సి వచ్చింది! రైల్వే చరిత్రలో ఈ అసాధారణ ఘటన గురించి తెలుసా? ఇంతకీ ఎవరా రైతు? ఏంటా కథ? వివరాల్లోకి వెళ్తే..**

ఒక సాధారణ రైతు ఏకంగా రైలుకు యజమాని అయిన అసాధారణ ఘటన పంజాబ్‌లోని లుథియానాలో జరిగింది. 2007లో లూథియానా-చండీగఢ్ రైల్వే లైన్ నిర్మాణానికి చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో రైల్వే అధికారులు చేసిన తప్పిదమే ఇందుకు కారణం. లుథియానాలోని కటానా అనే గ్రామంలో భూసేకరణ కోసం రైతులకు ఎకరానికి రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, కొన్నాళ్లకు తమ సమీప గ్రామంలో ఎకరానికి రూ.71 లక్షలు చొప్పున ఇచ్చినట్లు తెలుసుకున్న సంపూరణ్ సింగ్ అనే రైతు తమకు అన్యాయం జరిగిందంటూ కోర్టు మెట్లెక్కారు. తమకూ అంతే మొత్తంలో పరిహారం ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయపోరాటం సాగించారు. దీంతో రైల్వే శాఖ ఎకరానికి పరిహారాన్ని రూ.25లక్షల నుంచి రూ.50లక్షలకు పెంచింది.. అయినా వెనక్కి తగ్గకపోవడంతో ఆపై పరిహారం రూ.1.47కోట్లకు పెరిగింది. ఈ మొత్తాన్ని నార్తన్ రైల్వే 2015 లోగా చెల్లించాలని కోర్టు ఆదేశించినప్పటికీ రైల్వే అధికారులు చెల్లించలేదు. దీంతో సంపూరణ్ సింగ్ తనకు అందాల్సిన పూర్తి పరిహారం కోసం మళ్లీ కోర్టును ఆశ్రయించారు. రైల్వే శాఖ 2017 వరకు తనకు కేవలం రూ. 42లక్షలు మాత్రమే చెల్లించిందని.. కేసు గెలిచినా పూర్తి మొత్తాన్ని చెల్లించేందుకు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి జస్పాల్ వర్మ ఇచ్చిన తీర్పు అప్పట్లో సంచలనం సృష్టించింది. దిల్లీ-అమృత్‌సర్ స్వర్ణ్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలుతో పాటు లుథియానాలోని స్టేషన్ మాస్టర్ కార్యాలయాన్ని జప్తు చేయాలని జడ్జి ఆదేశించారు. కోర్టు ఇచ్చిన అసాధారణ తీర్పుతో శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కు యజమాని అయిన ఏకైక వ్యక్తిగా రైతు చరిత్ర సృష్టించారు. అయితే, ఆ తర్వాత రైల్వే అధికారులు కోర్టును ఆశ్రయించడంతో ఆ ఆదేశాలు రద్దయినా.. ఒక రైలుకు రైతు యజమానిగా ఉన్న ఆ సందర్భం మాత్రం రికార్డుల్లో నిలిచిపోయింది.

## కొత్త డొమైన్ ఇదేనా?

రిలయన్స్, డిస్నీలకు చెందిన ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు త్వరలో విలీనం కానున్నాయి. విలీన సంస్థను జియో స్టార్‌గా వ్యవహరించనున్నారు. రిలయన్స్‌కు చెందిన వయాకామ్ 18, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ విలీన ప్రక్రియ ఈ వారంలోనే పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విలీనం తర్వాత ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు అయిన జియో సినిమా, డిస్నీ౦ హాట్‌స్టార్ కలిసి ఒకే స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌గా అవతరించనుంది. ఈ నేపథ్యంలో జియోస్టార్ పేరిట కొత్త డొమైన్ తెరపైకి వచ్చింది. ఆ వెబ్‌సైట్‌లో ప్రస్తుతానికి 'కమింగ్ సూన్' అనే సందేశం కనిపిస్తోంది. జియో సినిమా, డిస్నీ౦ హాట్‌స్టార్ విలీనం అవుతాయన్న వార్తలు బయటకు వచ్చినప్పటి నుంచి అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. జియోహాట్‌స్టార్ పేరుతో కొత్త ఓటీటీ ప్లాట్‌ఫామ్ అవతరించబోతోందని వార్తలు రావడం.. ఆ డొమైన్ తనదేనంటూ ఓ యాప్ డెవలపర్ ముందుకు రావడం.. తన చదువుకయ్యే ఖర్చు రిలయన్సే భరించాలంటూ పేర్కొనడం అందరికీ తెలిసిందే. ఓ దశలో తక్కువ మొత్తానికే రిలయన్స్‌కు ఇస్తానని పేర్కొని ఒక్కసారిగా ఆ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఆపై యూఏఈకి చెందిన ఇద్దరు చిన్నారులు తెరపైకి రావడం.. ఈ డొమైన్‌ను ఉచితంగా ఇస్తామని తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో జియోహాట్‌స్టార్ డొమైన్ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ.. జియో స్టార్ అనే కొత్త వెబ్‌సైట్ దర్శనమిచ్చింది. ఇరు సంస్థ విలీనం తర్వాత నవంబర్ 14 నుంచి ఈ డొమైన్ అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది.




## మరింత తగ్గిన బంగారం, వెండి ధరలు..

దిల్లీ: బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజూ తగ్గుముఖం పట్టాయి. దేశీయంగా జువెలర్ల నుంచి ఆదరణ తగ్గడంతో పాటు అంతర్జాతీయంగానూ డిమాండ్ తగ్గడంతో వీటి ధరలు దిగి వచ్చాయి. దేశ రాజధాని దిల్లీలో మంగళవారం 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1750 తగ్గి రూ.77,800కు చేరినట్లు ఆలిండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. గత సెషన్‌లో ఈ మొత్తం రూ.79,550గా ఉంది. వెండి సైతం కిలో రూ.2700 క్షీణించి రూ.91,300కు చేరింది. అమెరికా ఎన్నికలకు ముందు వెండి కిలో రూ.లక్ష మార్కు కూడా దాటిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్సు 2597 డాలర్ల వద్ద కొనసాగుతోంది. వెండి ఔన్సు 30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయంతో డాలర్ పుంజుకొంది. ఆర్థిక వ్యవస్థ ఊపందుకుందన్న అంచనాలు పెరగడంతో బంగారానికి డిమాండ్ తగ్గడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. దీనికి తోడు ట్రంప్ రావడంతో ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కాల్పుల విరమణకు అవకాశాలు ఉన్నాయన్న అంచనాలు కూడా సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే పసిడి గిరాకీ తగ్గడానికి కారణం కావొచ్చని గాంధీ పేర్కొన్నారు. అమెరికా నుంచి వెలువడాల్సిన ద్రవ్యోల్బణ డేటా, ఫెడ్ సభ్యుల ప్రసంగాలు తదుపరి బంగారం ధరలను నిర్దేశించనున్నాయి.





# అది ప్రేక్షకుల తప్పు కాదు

ఏదైనా సినిమా అనుకున్నంత స్థాయిలో విజయం అందుకోకపోతే అది ప్రేక్షకుల తప్పు కాదని, మాలాంటి (ఆయా చిత్ర బృందాలు) వారిదేనని చిరంజీవి అన్నారు. 'జీబ్రా' ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్యదేవ్ , డాలీ ధనంజయ ప్రధాన పాత్రల్లో ఈశ్వర్ కార్తిక్ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముందస్తు విడుదల వేడుకను మంగళవారం నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ.. "కొన్ని వేడుకలకు రావడం ఎంతో ఉత్సాహంగా ఉంటుంది.

ప్రేమతో ఆహ్వానిస్తే ఎవరి ఫంక్షన్ అనేది చూడను. కొవిడ్ సమయంలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయి. చిత్ర పరిశ్రమ పరిస్థితేంటా? అని అనుకుంటుండగా ప్రేక్షకులు ఓటీటీకి అలవాటు పడ్డారు. భాషతో సంబంధం లేకుండా ఎన్నో సినిమాలు చూసే అవకాశం వచ్చింది. ఎలాంటి కథతో ఆడియన్స్‌ను సంతృప్తి పరచాలన్న ఆలోచనలు మెదులుతుండేవి. పెద్ద హీరోల సినిమాలేగానీ చిన్న చిత్రాలను ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లి చూసే పరిస్థితి లేదు. ఇదేం కష్టకాలం, మన పరిశ్రమ ఏమైపోతుందన్న ఆందోళన ఉండేది" అని అన్నారు.

"ఈ ఏడాది ఆరంభంలో విడుదలైన 'హనుమాన్' అనూహ్య విజయాన్ని అందుకుంది. 'ఆల్ ఇండియా' సినిమా అయింది. చిన్న సినిమాలను ఆదరించి పెద్ద సినిమాలుగా మారుస్తున్నారు తెలుగు ప్రేక్షకులు. 'కమిటీ కుర్రోళ్లు', 'టిల్లు స్క్వేర్', 'ఆయ్' ఇలా ఎన్నో హిట్ అయ్యాయి. వేసవి సీజన్‌లోనే తక్కువ సినిమాలొచ్చాయి. దీపావళికి విడుదలైన 'అమరన్', 'క', 'లక్కీ భాస్కర్' సైతం ఎంతో ఆదరణ పొందాయి. వీటిలో పెద్ద హీరోలు నటించలేదు, భారీ బడ్జెట్‌తో రూపొందించలేదు. కంటెంటే బలం. 'మత్తువదలరా 2' సినిమా ఆద్యంతం నన్ను అలరించింది. రెండు సార్లు చూశా. మంచి వినోదాన్ని అందిస్తే ఆస్వాదించేందుకు ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధమే. 'జీబ్రా' అలాంటిదే అనుకుంటున్నా. ఇందులో మంచి నటులున్నారు. క్రైమ్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయని విన్నా. ఈ బొమ్మ సూపర్‌హిట్ అవుతుంది. సత్యదేవ్ కల్మషం లేని వ్యక్తి. ఇంప్రెస్ చేయాలని అనుకోడు. అతడు నటించిన 'బ్లఫ్ మాస్టర్'ను కొవిడ్ టైమ్‌లో చూశా. ముందుగా తెలుగు వాడు కాదేమో అనుకున్నా.


# జాన్వీకి రిస్క్ తీసుకోవడం అంటే ఇష్టం..



జాన్వీకపూర్‌పై ఆమె సోదరుడు అర్జున్ కపూర్ ప్రశంసలు కురిపించారు. కెరీర్‌లో రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడుతుందన్నారు. అవసరమైనప్పుడు ధైర్యాన్నిస్తుందన్నారు. 'సింగం అగైన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్వీ, ఖుషి కపూర్‌లతో తనకున్న అనుబంధాన్ని అర్జున్ కపూర్ పంచుకున్నారు.

'నాకు జాన్వీ, ఖుషి ఇద్దరిపైనా ఎంతో ప్రేమ ఉంది. వీరిలో జాన్వీతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆమె ఏ విషయంలోనైనా నిజాయతీగా ఉంటుంది. ప్రశంసలను, విమర్శలను ఒకేలా తీసుకుంటుంది. ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కోసం ఎంతో కష్టపడుతుంది. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ.. కొత్త కథలను ఎంచుకుంటూ ప్రయోగాలు చేస్తుంటుంది. ఎక్కువ రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడుతుంది. ఆమె ప్రతి నిర్ణయానికి నేను మద్దతు ఇస్తాను. ఎప్పుడూ అండగా ఉంటాను. మేమిద్దరం రోజూ ఎన్నో విషయాల గురించి చర్చించుకుంటాం. తినే ఆహారం దగ్గర నుంచి.. తర్వాత చేయనున్న ప్రాజెక్ట్ వివరాల వరకూ ప్రతిదాని గురించి మాట్లాడుకుంటాం. ఇది ఎప్పటికీ ఇలాగే కొనసాగాలి' అని అర్జున్ కోరుకున్నారు .

ఇక జాన్వీకపూర్ ప్రస్తుతం బాలీవుడ్, టాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇటీవలే 'దేవర'తో మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇందులో నటిస్తున్న సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ ప్రాజెక్ట్‌లోనూ అవకాశాన్ని అందుకున్నారు . బుచ్చిబాబు దర్శకత్వంలో స్పోర్ట్స్ డ్రామాగా ఇది రానుంది. మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'పెద్ది' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి ఇందులో విలన్‌గా కనిపించనున్నట్లు సమాచారం.



# 'హ్యారీపోటర్'లా ప్రభాస్ సినిమా

ప్రభాస్ కొత్త సినిమాలపై నిర్మాత భూషణ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'ది రాజాసాబ్' గురించి చెబుతూ.. "ఆ సినిమాలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. నేను కొన్ని సీన్స్ చూశా. అవి హాలీవుడ్ మూవీ 'హ్యారీపోటర్'ను తలపించేలా ఉన్నాయి" అని పేర్కొన్నారు. 'స్పిరిట్' గురించి మాట్లాడుతూ.. "వచ్చే ఏడాది ప్రారంభంలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం. డిసెంబరులో లాంఛనంగా ప్రారంభిస్తాం. ఇది చాలా పెద్ద సినిమా. పోలీసు కథా నేపథ్యంతో విభిన్న జానర్‌లో సాగుతుంది. ప్రముఖ నటులు ఇందులో భాగం కానున్నారు. వారి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం. ఆ సినిమా కోసం ప్రభాస్ కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు" అని అన్నారు. ఇంతకుముందు ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' నిర్మాతల్లో భూషణ్ కుమార్ ఒకరు. 'స్పిరిట్'కూ ఆయనే నిర్మాత. హారర్ కామెడీ నేపథ్యంతో దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న చిత్రమే 'ది రాజాసాబ్'. మాళవికా మోహనన్, రిద్ధికుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లు. ఇందులో ప్రభాస్ కొత్త లుక్‌లో కనిపించనున్నారు. సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న చిత్రమే 'స్పిరిట్'. అందులో ప్రభాస్ పోలీసు అధికారిగా నటించనున్నారు. 2026లో సినిమాని విడుదల చేయనున్నారు.

# అలా చేసి ఉంటే 1000 కోట్లు చేసేది!




'పరుచూరి పాఠాలు' పేరుతో రచయిత పరుచూరి గోపాలకృష్ణ సినిమాలను విశ్లేషిస్తారనే సంగతి తెలిసిందే. తాజాగా 'దేవర' గురించి మాట్లాడారు. ఆ సంగతులివీ.. 'దేవర' పార్ట్ 1 సినిమాపై ప్రముఖ సినీ కథా రచయిత పరుచూరి గోపాలకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. 'పరుచూరి పాఠాలు' పేరుతో తన యూట్యూబ్ ఛానల్ వేదికగా ఆ చిత్రాన్ని విశ్లేషించారు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలై, ప్రస్తుతం ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ అవుతోన్న 'దేవర' గురించి పరుచూరి పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..



"ఆర్ఆర్ఆర్' తర్వాత సోలో హీరోగా ఎన్టీఆర్ 'దేవర'ను ప్రకటించగానే ఎలాంటి కథలో నటిస్తాడోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. దర్శకుడు కొరటాల శివ తీసిన గత సినిమా ఇచ్చిన ఫలితాన్ని కూడా అభిమానులు పరిగణనలోకి తీసుకుంటారు. అలా అనుకోవడం అన్నిసార్లు కరెక్ట్ కాదు. మేం కూడా ఎన్నో గొప్ప విజయాలు చూశాం. అదే స్థాయిలో పరాజయాలు ఎదుర్కొన్నాం. దానికి ఎవరినీ నిందించలేం. ఈ సినిమా విషయంలో మెచ్చుకోవాల్సిన అంశాలు సినిమాటోగ్రఫీ (రత్నవేలు), సంగీతం (అనిరుధ్). మ్యూజిక్ బాగుందిగానీ ఎన్టీఆర్ స్థాయికి తగ్గట్టులేదనేది నా అభిప్రాయం. సినిమా విడుదలైన సమయంలో రచయితలతో మాట్లాడినప్పుడు.. కొందరు బాగోలేదని చెప్పారు. కొందరు యావరేజ్ అన్నారు. మరికొందరు చాలా బాగుందన్నారు. ఇలా మిశ్రమ స్పందన వచ్చినా.. సినిమా విజయవంతంగా ప్రదర్శితమవ్వాలంటే బలమైన హీరో ఉండాలి. మా చిన్న రామయ్య (ఎన్టీఆర్) అలాంటి వారిలో ఒకడు" "క్లుప్తంగా ఇది సముద్రపు దొంగల కథ. అలాంటి ఓ దొంగ మంచి వాడిగా మారిన తర్వాత ఏమైంది? అన్నది కీలకం. ఈ చిన్న పాయింట్ ఆధారంగా ఎక్కువ నిడివితో సినిమాని తెరకెక్కించడం జోక్ కాదు. పైగా ఎక్కువ సన్నివేశాల్లో సముద్రాలకు సంబంధించినవే. కొరటాల శివ 'స్క్రీన్‌ప్లే మాస్టర్' అనిపించుకున్నాడు. నిజంగా జరిగిన కథే అనిపించేలా మాయ చేశాడు. ఇది ఎన్టీఆర్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోదని మొదట నేను అనుకున్నా. కానీ, 'ఇది ఎన్టీఆర్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయేలా' తీసి, విజయం అందుకోవడం మామూలు విషయం కాదు. ఇదే స్టోరీని హాలీవుడ్‌లో అయితే సూపర్ అంటారు. తండ్రి ప్రతీకారాన్ని తీర్చుకునే తనయుడి కథ అని ప్రేక్షకుడు అనుకునేలా శివ తీర్చిదిద్దాడు. కథ తెలిసినా కథనం గొప్పగా ఉంటే సినిమాలు విజయం అందుకుంటాయనడానికి ఇదొక ఉదాహరణ. ఎన్టీఆర్ నటన సహజంగా ఉంది. ట్విస్టులు బాగున్నాయి. అయితే, ఫస్టాఫ్‌లో దేవర పాత్ర ఫ్లాష్‌బ్యాక్‌ను పూర్తిగా చూపించడానికి బదులు కొంత చూపించి.. దేవర కొడుకు, హీరోయిన్‌తో అతడి రొమాంటిక్ సన్నివేశాలు, వినోదాత్మక సీన్స్‌ను పెట్టి ఉండుంటే ఈ సినిమా రూ.1000 కోట్లు దాటేసి ఉండేదని నా విశ్వాసం" అని పేర్కొన్నారు.



# లవ్ లెటర్లు రాసి ఆయనను వేధించా

ఎవరి జీవితంలోనైనా ప్రేమ మధురమే. ప్రేమించి పెళ్లి చేసుకుంటే జీవితమంతా ఆనందమే. అలానే ప్రేమించి పెళ్లి చేసుకున్నారు మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్. తాజాగా ఆయన భార్య సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో వారి ప్రేమ పెళ్లి గురించి పంచుకున్నారు. మోహన్‌లాల్-సుచిత్రల ప్రేమ ప్రయాణం ఆమె మాటల్లోనే.. 'నేను చేతన్ (మోహన్‌లాల్)ను మొదటిసారి తిరువనంతపురంలో ఓ పెళ్లిలో చూశాను. ఆ రోజు చేతన్ మెరున్ కలర్ షర్ట్ వేసుకొని కనిపించారు. అంతకు ముందు తెరపై చూడడమే కానీ, ప్రత్యక్షంగా చూడడం అదే తొలిసారి. మా రెండు కుటుంబాలకు కామన్ ఫ్రెండ్స్ ఉన్నారని ఆ పెళ్లిలో తెలిసింది. ఆయన నటించిన తొలి సినిమా 'మజిల్ విరింజ పుక్కల్' చూసినప్పుడు ప్రేమ కలగలేదు. ఆ తర్వాత ఆయన సినిమాలన్నీ చూడడం మొదలుపెట్టా. ఆయనెంత ప్రతిభావంతుడో అర్థమైంది. అప్పటినుంచి ఆయన్ని ఇష్టపడడం మొదలుపెట్టాను. నా పేరు రాయకుండా ఆయనకు ఉత్తరాలు రాయడం ప్రారంభించాను. రోజుకు ఐదు కార్డులు రాసేదాన్ని. ఆయన ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకొని ఆ అడ్రస్‌లకు లేఖలు రాసేదాన్ని. ఒక్కమాటలో చెప్పాలంటే నా ప్రేమతో ఆయన్ని వేధించాను. ఆయన్ని సుందర కుట్టప్పన్ (అందమైన అబ్బాయి) అని కోడ్ భాషలో పిలిచేదాన్ని. బహుశా ఈ విషయం ఆయనకు కూడా తెలియదేమో. మా అమ్మ నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నప్పుడు చేతన్ గురించి చెప్పాను. కామన్ ఫ్రెండ్స్ ద్వారా మాట్లాడి.. మా పెళ్లి చేశారు' అంటూ సుచిత్ర తన లవ్‌స్టోరీని గుర్తుచేసుకున్నారు. 1988లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్న సంగతి తెలిసిందే.

# ఆ విషయంలో సెంటిమెంట్!

అక్కినేని హీరో అక్కినేని నాగార్జున ఇంట్లో త్వరలోనే పెళ్లి భాజాలు మోగనున్నాయి. ఇప్పటికే ఎంగేజ్‌మెంట్ చేసుకున్న నాగచైతన్య-శోభిత ధూళిపాళ్ల పెళ్లిబంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ ఏడాది ఆగస్టులో వీరిద్దరు నిశ్చితార్థం చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను నాగార్జున సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఇటీవల అన్నపూర్ణ స్టూడియోస్‌లో నిర్వహించిన ఏఎన్నార్ శతజయంతి వేడుకల్లో కాబోయే అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ్ల సందడి చేసింది.

వచ్చేనెల డిసెంబర్ 4న వీరి పెళ్లి గ్రాండ్‌గా జరగనుంది. అయితే పెళ్లి వేదిక విషయంలో మాత్రం ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. తాజా సమాచారం ప్రకారం నాగచైతన్య- శోభిత పెళ్లి వేడుక హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లోనే జరగనుందట. ఎందుకంటే అక్కినేని కుటుంబానికి సెంటిమెంట్ కావడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా తెలుగువారి సినీదిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం కూడా అక్కడే ఉంది. అందువల్లే పెళ్లి వేడుక అక్కడే నిర్వహిస్తే తాతయ్య ఆశీర్వాదాలు కూడా ఉంటాయని అక్కినేని కుటుంబసభ్యులు భావిస్తున్నారట. కాగా.. ఏఎన్నార్ శతజయంతి వేడుకలు కూడా అక్కడే నిర్వహించారు.





# కోహ్లి... ముందుగానే

బోర్డర్-గావస్కర్ టెస్టు సిరీస్ కోసం విరాట్ కోహ్లి ముందుగానే ఆస్ట్రేలియాలో అడుగుపెట్టాడు. ఆదివారమే ఈ స్టార్ బ్యాటర్ పెర్త్ చేరుకున్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమైన అతడు.. ఆసీస్‌పై రాణించాలనే పట్టుదలతో ఉన్నాడు. పెర్త్: బోర్డర్-గావస్కర్ టెస్టు సిరీస్ కోసం విరాట్ కోహ్లి ముందుగానే ఆస్ట్రేలియాలో అడుగుపెట్టాడు. ఆదివారమే ఈ స్టార్ బ్యాటర్ పెర్త్ చేరుకున్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమైన అతడు.. ఆసీస్‌పై రాణించాలనే పట్టుదలతో ఉన్నాడు. ఆదివారం ఆసీస్‌కు బయల్దేరిన తొలి బృందంలో శుభ్‌మన్ గిల్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్, వాషింగ్టన్ సుందర్, యశస్వి జైస్వాల్, సహాయక కోచ్ అభిషేక్ నాయర్ ఉన్నారు. టీమ్‌ఇండియా ప్లేయర్లు ముంబయి నుంచి సింగపూర్‌కు.. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు వెళ్లారు. వైస్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా, కోచ్ గౌతమ్ గంభీర్‌లతో కూడిన రెండో బృందం సోమవారం ఆసీస్ విమానమెక్కింది. కెప్టెన్ రోహిత్‌శర్మ ఈ బృందంతో పాటు లేడు.



# మలేసియాను చిత్తుచేసి

మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీని డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఘనంగా మొదలెట్టింది. సోమవారం తొలి మ్యాచ్‌లో ఆ జట్టు 4-0 తేడాతో మలేసియాను చిత్తుచేసింది. సంగీత (8వ, 55వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో సత్తాచాటగా.. ప్రీతి దూబె (43వ), ఉదిత (44వ) చెరోసారి బంతిని గోల్‌పోస్టులోకి పంపించారు. ఆరంభంలో మలేసియా కాస్త జోరు ప్రదర్శించింది. అయిదో నిమిషంలోనే ఆ జట్టు పెనాల్టీ కార్నర్ (పీసీ) దక్కినా.. మన రక్షణశ్రేణి బలంగా నిలబడి గోల్ కాకుండా అడ్డుకుంది. అక్కడి నుంచి భారత్ వేగం పెంచింది. దాడులను ఉధృతం చేసింది. రెండు నిమిషాల వ్యవధిలోనే టీమ్‌ఇండియాకు రెండు పీసీలు దక్కగా.. రెండోదాన్ని సద్వినియోగం చేసిన సంగీత జట్టు ఖాతా తెరిచింది. కానీ ఆ తర్వాత మరో గోల్ చేసేందుకు భారత్‌కు బాగానే సమయం పట్టింది. మధ్యలో పీసీలు, ఇతర గోల్ ప్రయత్నాలు విఫలమయ్యాయి. మూడో క్వార్టర్ చివర్లో బంతిని గోల్‌పోస్టులోకి పంపిన ప్రీతి ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. ఆ వెంటనే పీసీని ఉదిత గోల్‌గా మలచింది. ఆఖర్లో సంగీత అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో భారత్‌కు అదిరే ముగింపునిచ్చింది. భారత్ మంగళవారం తర్వాతి మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో తలపడుతుంది.



# సింధు గాడినపడేనా!

భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్‌లు జపాన్ మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత కొంతకాలంగా ఫామ్‌లో లేక ఇబ్బందులు పడుతున్న సింధు, లక్ష్య.. జపాన్ మాస్టర్స్‌లో లయను దొరకబుచ్చుకోవాలని భావిస్తున్నారు. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో బుసానన్ (థాయ్‌లాండ్)తో సింధు తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో లియోంగ్ జున్ (మలేసియా)తో లక్ష్య తన పోరాటాన్ని ప్రారంభిస్తాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో యిన్ హ్యూ- లిన్ యున్ (చైనీస్ తైపీ) జంటతో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ పోటీపడనుంది.

# రోహిత్ ఆడకపోతే..

ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో లేకుంటే జస్‌ప్రీత్ బుమ్రా నాయకత్వ బాధ్యతలు చేపడతాడని కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. అంతేకాక రోహిత్ స్థానంలో కేఎల్ రాహుల్ ఓపెనింగ్ చేసే అవకాశాలున్నట్లు అతను చెప్పాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఈ నెల 22న తొలి టెస్టు ఆరంభం కానుంది. అదే సమయంలో తన భార్య రెండో బిడ్డకు జన్మనిచ్చే అవకాశాలుండడంతో రోహిత్ ఈ మ్యాచ్‌లో ఆడడం అనుమానంగా మారింది. ఈ నేపథ్యంలో గంభీర్ మాట్లాడుతూ.. "రోహిత్ అందుబాటులో ఉండేది లేనిది స్పష్టత లేదు. ఏదైనా తర్వాత తెలుస్తుంది. అతను ఆడతాడనే ఆశతోనే ఉన్నాం.



బుమ్రా వైస్‌కెప్టెన్ కాబట్టి రోహిత్ అందుబాటులో లేకుంటే అతనే పెర్త్‌లో జట్టును నడిపిస్తాడు. ఓపెనింగ్ కోసం ఈశ్వరన్, కేఎల్ రాహుల్‌ల రూపంలో ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. మ్యాచ్ సమయానికి తుది నిర్ణయం తీసుకుంటాం. అనుభవం, నాణ్యతను బట్టి ఆటగాడిని ఎంచుకుంటాం. రాహుల్ టాప్ ఆర్డర్లోనే కాక మిడిల్‌లోనూ ఆడగలడు. ఓపెనింగ్ చేయడంతో పాటు ఆరో స్థానంలోనూ ఆడగల రాహుల్ లాంటి ఆటగాళ్లు ఎన్ని జట్లలో ఉంటారు? రోహిత్ అందుబాటులో లేని పక్షంలో రాహుల్ ఓపెనింగ్ చేయడానికి అవకాశముంది" అని గంభీర్ అన్నాడు.

రికీ.. మీ జట్టు సంగతి చూస్కో: విరాట్ కోహ్లి ఫామ్ గురించి ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు రికీ పాంటింగ్ చేసిన వ్యాఖ్యలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. రికీ ఆస్ట్రేలియా క్రికెట్‌కు పరిమితమైతే మంచిదన్నాడు. కోహ్లి గత అయిదేళ్లలో రెండు సెంచరీలే చేసినట్లు చదివి ఆశ్చర్యపోయానని.. అదే నిజమైతే ఆందోళన కలిగించే విషయమే అని.. మరే టాప్ ఆర్డర్ బ్యాటర్ ఇలాంటి గణాంకాలతో ఉండడేమో అని పాంటింగ్ ఇటీవల వ్యాఖ్యానించాడు. దీనిపై గంభీర్ స్పందిస్తూ.. "పాంటింగ్‌కు భారత క్రికెట్‌తో ఏం పని? అతను ఆస్ట్రేలియా క్రికెట్ గురించి ఆలోచించాలి. కోహ్లి, రోహిత్‌ల విషయంలో నాకు ఎలాంటి ఆందోళనా లేదు. వాళ్లిద్దరూ దృఢమైన వ్యక్తులు. భారత క్రికెట్ కోసం వాళ్లు ఎంతో చేశారు. ఇప్పటికీ ఆ ఇద్దరిలో ఎంతో తపన ఉంది. ఇంకా ఎంతో సాధించాలని కోరుకుంటున్నారు. డ్రెస్సింగ్‌లో రూంలో ఉన్న వాళ్లందరూ తపనతో ఉన్నారా అన్నదే ముఖ్యం.

ఛాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించడానికి పీసీబీ అంగీకరించకపోతే టోర్నీ మొత్తాన్ని సౌతాఫ్రికాలో నిర్వహించే అవకాశమున్నట్లు సమాచారం.

# ఛాంపియన్స్ ట్రోఫీకి పాక్ దూరం?

ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఆతిథ్య హక్కులను పాకిస్థాన్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మ్యాచ్‌ల నిర్వహణకు మూడు స్టేడియాల్లో ఆధునికీకరణ పనులు చేపడుతోంది. అయితే, పాకిస్థాన్‌కు వెళ్లి టోర్నీలో ఆడేందుకు భారత జట్టు సిద్ధంగా లేదు. టోర్నమెంట్‌ను హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తేనే పాల్గొంటామని భారత్ ఐసీసీకి తేల్చి చెప్పింది. భారత్ ఆడే మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించాలని పాక్ క్రికెట్ బోర్డు ని ఐసీసీ కోరింది. కానీ, ఈ ప్రతిపాదనకు పీసీబీ అంగీకరించలేదట. తమ ఆతిథ్య హక్కులను తగ్గిస్తే ఏకంగా టోర్నీని వీడాలని పాక్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య వివాదాలు పరిష్కారమయ్యే వరకు.. భారత్‌లో జరిగే మరే ఇతర ఐసీసీ ఈవెంట్లలోనూ పాల్గొనకూడదని పాక్ భావిస్తోందట. 2036 ఒలింపిక్స్ నిర్వహణకు తమ ఆసక్తిని తెలియజేస్తూ ఐఓసీ భవిష్యత్ ఆతిథ్య కమిషన్‌కు భారత్ లేఖ ఇచ్చింది. అయితే పాకిస్థాన్ ఇందుకు వ్యతిరేకంగా లాబీయింగ్ చేయాలనుకుంటుందని పాక్ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఒకవేళ పీసీబీ ఇలాగే మొండిగా వ్యవహరించి హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించకపోతే టోర్నీ మొత్తాన్ని సౌతాఫ్రికాలో నిర్వహించే అవకాశమున్నట్లు సమాచారం. "ప్రస్తుతం హైబ్రిడ్ మోడల్ విధానంలో ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడంపై ఎలాంటి చర్చలు జరగలేదు. మొత్తం పరిస్థితిని పీసీబీ అంచనా వేస్తోంది. తదుపరి ఏం చేయాలనే దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ వ్యవహారంపై పాక్ ప్రభుత్వం, బోర్డు చర్చలు జరుపుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బోర్డు పనిచేస్తుంది" అని పీసీబీ అధికారి ఒకరు తెలిపారు.

## 'అలా జరిగితే పాక్‌కు రెండు పాయింట్లు కేటాయించాలి'

హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ జరిగి భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉంటే పాక్‌కు రెండు పాయింట్లు కేటాయించాలని ఆ దేశ మాజీ క్రికెటర్ బసిత్ అలీ డిమాండ్ చేశాడు. 1996 ప్రపంచకప్‌లో భద్రతా కారణాల దృష్ట్యా వెస్టిండీస్, ఆస్ట్రేలియా తమ మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడటానికి నిరాకరించాయి. దీంతో శ్రీలంకకు నాలుగు పాయింట్లు కేటాయించిన విషయాన్ని బసిత్ అలీ గుర్తు చేశాడు. "1996 ప్రపంచకప్‌లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా శ్రీలంకకు వెళ్లలేదు. దీంతో లంకకు నాలుగు పాయింట్లు ఇచ్చిన విషయం గుర్తుందా? భారత్, పాకిస్థాన్‌లను వేర్వేరు గ్రూప్‌లలో ఉంచడానికి ప్రయత్నిస్తే ఐసీసీ తిరస్కరిస్తుంది. పాకిస్థాన్, భారత్ ఎప్పుడూ ఒకే గ్రూప్‌లో ఉంటాయి. ఎందుకంటే డబ్బు కోసం. టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరిగితే టీమ్‌ఇండియా పాకిస్థాన్‌కు రాదు. కాబట్టి.. పాకిస్థాన్‌కు కూడా రెండు పాయింట్లు ఇవ్వాల్సిందే. గతంలోనూ అదే జరిగింది. ఇప్పుడు అదే చేయండి. ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం విషయంలో పాకిస్థాన్ కఠినంగా ఉండాలి. టోర్నీ పాక్‌లో జరిగేలా పట్టుబట్టాలి. టోర్నమెంట్‌ను వేరే దేశంలో నిర్వహిస్తే పాక్ ఆడకూడదు. అలా చేస్తే పాకిస్థాన్‌పై నిషేధం విధించాలని కొందరు అంటున్నారు. దమ్ముంటే ఆ పని చేయండి. మీకు నిద్ర కూడా పట్టదు" అని బసిత్ అలీ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు.




# వికెట్ల వేటలో కొత్తగా...

వరుణ్ చక్రవర్తి.. ఐపీఎల్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో మిస్టరీ స్పిన్నర్‌గా పేరు తెచ్చుకుని 2021లోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆటగాడు. కానీ టీమ్‌ఇండియా తరపున అంచనాలను అందుకోలేక చతికిలపడ్డాడు. శ్రీలంకతో అరంగేట్ర టీ20 సిరీస్‌లో రెండు వికెట్లే పడగొట్టాడు. అదే ఏడాది టీ20 ప్రపంచకప్‌లో ఒక్క వికెట్టూ తీయలేకపోయాడు. దీంతో జట్టులో చోటు గల్లంతైంది. మూడేళ్లు గడిచిపోయాయి. కట్ చేస్తే.. ఇప్పుడు భారత టీ20 జట్టులో కీలక స్పిన్నర్‌గా మారాడు. వరుసగా ఐపీఎల్ రెండు సీజన్లలో సత్తాచాటి ఈ ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్‌తో పునరాగమనం చేసిన అతను.. ఇప్పుడు సఫారీ గడ్డపై సంచలన ప్రదర్శనతో సాగుతున్నాడు. రెండో టీ20లో భారత్ ఓడినప్పటికీ తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన (5/17)తో వరుణ్ అదరగొట్టాడు. అతని బంతులకు స్టంప్స్ ఎగిరిపోయి.. దక్షిణాఫ్రికా బ్యాటర్లు పెవిలియన్ చేరుతుంటే భారత అభిమానులకు భలే కిక్ వచ్చింది. మరి ఒకప్పటితో పోలిస్తే 33 ఏళ్ల ఈ తమిళనాడు ఆటగాడి బౌలింగ్‌లో ఏం మారిందనే ప్రశ్నకు.. వరుణ్ సమాధానం చెప్పాడు. "అంతర్జాతీయ స్థాయిలో విఫలమవుతుండటంతో నా బౌలింగ్ వీడియోలను మళ్లీ పరిశీలించా. సైడ్ స్పిన్ వేస్తున్నానని, అది అత్యున్నత స్థాయిలో పనిచేయడం లేదని తెలుసుకున్నా. ఆ తర్వాత నా బౌలింగ్‌ను పూర్తిగా మార్చుకున్నా. అందుకు రెండేళ్లు పట్టింది. తిరిగి స్థానిక లీగ్‌ల్లో, ఐపీఎల్‌లో కొత్తగా బౌలింగ్ చేయడం మొదలెట్టా. అక్కడ ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ రాణిస్తున్నా. నిలకడ, ఓవర్ స్పిన్‌తో అయిదు వికెట్ల ఘనత దక్కింది. ఓవర్‌స్పిన్‌కు పిచ్ నుంచి సహకారం లభిస్తుంది. ఇలాగే బౌలింగ్ చేస్తూ, జట్టు విజయాల్లో భాగమవుతాననే నమ్మకంతో ఉన్నా. గత మూడేళ్లు ఎంతో కఠినంగా గడిచాయి.

